


జూన్ 21న ఆర్‌యూలో కాన్వకేషన్

కర్నూలు(అర్బన్), మే 2: రాయలసీమ యూనివర్సిటీలో జూన్ 21న కాన్వకేషన్ ఉంటుందని ఉప కులపతి సుధీర్ ప్రేమ్ కుమార్ తెలిపారు. రాజ్‌భవన్ అందించిన ప్రాథమిక సమాచారం మేరకు గత ఏడాది సెప్టెంబరు 9న 4వ కాన్వకేషన్ ప్రకటనను గుర్తు చేశారు. ఈ మేరకు ప్రభుత్వంతో, ఉన్నత విద్యామండలితో సంప్రదించాక స్నాతకోత్సవ వివరాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

కోడుమూరు, మే 2:
ఎండలు మండుతున్నాయి. జనాల గొంతులు ఎండుతున్నాయి. మంచి నీటి కోసం పట్టణ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వేసవి ముదిరేకొద్దీ హంద్రీ నది ఎండిపోయి ఎడారిగా మారుతోంది. నదీ గర్భం ఒట్టిపోతోంది. మంచినీటి పథకానికి నదిలో వేసిన బోర్లు మొరాయిస్తున్నాయి. నదిలో చుక్క నీరు లేకపోవడంతో పట్టణానికి నీరు అందించడానికి పంచాయతీ అధికారులు నానాపాట్లు పడుతున్నారు. హంద్రీనదికి గాజులదిన్నె ప్రాజెక్టు లేక ఎల్లెల్సీ నీటి విడుదల చేస్తే తప్ప ప్రజలకు తాగునీరు అందించే పరిస్థితి లేదు. ఎప్పటి నుంచో వినిపిస్తున్న ఈ పైప్‌లైన్ పథకం ఏమైందని ప్రజలు అడుగుతున్నారు. ఒక పక్క ఎండలు. ఇంకో పక్క ఎన్నికలు. గత ఎన్నికల్లాగే ఈసారి కూడా వైసీపీ జీడీపీ నుంచి పైపులైన్ ద్వారా నీరు ఇస్తామని ప్రచారం చేసుకుంటున్నారు. ఇంతకూ ఇదంతా సమస్య పరిష్కరించేందుకా? లేక మళ్లీ అధికారం కోసమా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. .

ఎండిన హంద్రీనది



జీడీపీ పైప్‌లైన్ ఏమైంది?

- గత ఎన్నికల ముందు హామీ ఇచ్చి మర్చిపోయిన వైసీపీ
- మళ్లీ ఓట్ల కోసమే తెరపైకి పైప్‌లైన్
- ప్రభుత్వం తీరుపై మండిపడుతున్న జనాలు

కోడుమూరు పట్టణంలో సుమారు 45వేల జనాభా, 23వేల మంది ఓటర్లు ఉన్నారు. పట్టణ ప్రజలకు గత కొన్ని దశాబ్దాల నుంచి తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. కోడుమూరు పట్టణానికి కనుచూపు మేర నీటి వనరులు లేవు. కేవలం గాజులదిన్నె ప్రాజెక్టు లేదా ఎల్లెల్సీ కాల్వ నుంచి కోడుమూరు హంద్రీనదికి నీరు పైపులైన్ ద్వారా తీసుకొస్తేనే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. ప్రతి ఎన్నికల్లో అభ్యర్థులు జీడీపీ నుంచి తాగునీటిని తీసుకొస్తాం.. సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకును నిర్మిస్తాం.. అని 2004, 2009, 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో వాగ్దానం చేస్తూనే ఉన్నారు. ఆ తర్వాత విస్మరించి మోసం చేస్తూనే ఉన్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి 50 కిలో మీటర్ల దూరంలో ఉన్న డోన్, పత్తికొండ నియోజకవర్గ ప్రజలకు నీరు తరలించుకొని వెళ్తున్నారు. కానీ కేవలం 17 కిలోమీటర్లు ఉన్న కోడుమూరుకు మాత్రం నీరు అందించడం లేదు. ఇది ం రాజకీయ నాయకుల వైఫల్యమే అని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో కూడా ఇదే నినాదం తిరిగి వినిపిస్తోంది. అభ్యర్థులు ఓట్ల కోసం ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు.

ప్రజలను మోసగించిన వైసీపీ ఎమ్మెల్యే సుధాకర్, కోట్ల హర్ష

2019 ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వచ్చిన 6నెలల్లో గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైను తీసుకొచ్చి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఆనాడు డాక్టర్ జరదొడ్డి సుధాకర్, కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం జీడీపీ నుంచి పైపులైన్ మాట ఊసే ఎత్తలేదు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఓట్ల కోసం వైసీపీ నేతలు నాటకాలు మొదలు పెట్టారు. 6 నెలల్లో పైపు లైన్ తీసుకొస్తామన్న వైసీపీ నేతలు నాలుగు సంవత్సరాల తర్వాత పైపులైన్ కోసం ప్రభుత్వం నుంచి రూ.27 లక్షల నిధులు మంజూరు అయ్యాయని గొప్పలు చెప్పుకొచ్చారు. నిధులు మంజూరు అయ్యాయి కానీ టెండర్‌కు ఏ కాంట్రాక్టర్ ముందుకు రాలేదని ఓట్ల కోసం ప్రజలను బుజ్జగించే ప్రయత్నం చేశారు.



ట్యాంకర్ దగ్గర నీరు పట్టుకుంటున్న ప్రజలు



టీడీపీకి అవకాశం ఇచ్చి చూడండి

2019 ఎన్నికల్లో కోడుమూరు మండల ప్రజలు వైసీపీని నమ్ముకొని మోసపోయారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జీడీపీ నుంచి పైపులైన్ తీసుకొచ్చి కోడుమూరు పట్టణ చిరకాల కోరిక తీరుస్తా. తాగు నీటి సమస్య శాశ్వత పరిష్కారం టీడీపీతోనే సాధ్యం. జీడీపీలో నీరులేక పోతే 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఒప్పించి పందికోన దగ్గర హంద్రీనీవా కాల్వకు రంధ్రం ఏర్పాటు చేసి ప్రతి ఏటా జీడీపీకి ఒక టీఎంసీ నీటిని మళ్ళించాను. ఈ విషయాన్ని ప్రజలు గుర్తు చేసుకోవాలి. ప్రస్తుతం ఆ ఒక్క టీఎంసీ నీరు ప్రజల తాగు, సాగు నీరు అవసరాలు తీరుస్తున్నది. నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ప్రజలు టీడీపీని గెలిపించాలి.

డి. విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు



ట్యాంకుల వద్ద ..

బ్యాలెట్ పేపర్లు త్వరగా ప్రింట్ చేయండి



ప్రింటింగ్ పేపరును పరిశీలిస్తున్న కలెక్టర్ డా.జి. సృజన

కర్నూలు(కలెక్టరేట్), మే 2: బ్యాలెట్ పేపర్లను త్వరగా ప్రింట్ చేసి అన్ని జిల్లాలకు పంపించండని అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.జి. సృజన ఆదేశించారు. గురువారం స్థానిక ఎన్‌ఆర్‌పేటలోని ప్రభుత్వ ప్రాంతీయ ముద్రణా కార్యాలయంలో సాధారణ ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈవీఎం కమిషనింగ్ మొదలైనందున తొలుత అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ బ్యాలెట్ పేపర్లు డిస్పాచ్ చేస్తామని అన్నారు. 16 కంటే ఎక్కువ మంది అభ్యర్థులు ఉండి రెండు బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేయాల్సిన పార్లమెంటు నియోజకవర్గాల బ్యాలెట్ పేపర్లు మాత్రం అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు పూర్తయిన తర్వాత ప్రింట్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూలు నియోజకవర్గ ఆర్వో భార్గవ్‌తేజ, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎల్. మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ జైలుకే.. ఓటేయకండి

- విజనరీ చంద్రబాబుకు పట్టం కట్టండి
- సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు(అర్బన్), మే 2: సీఎం జగన్ జైలుకు వెళ్లడం ఖాయమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక నేరాల కేసుల్లో జూన్ 4 తరువాత జగన్ జైలుకు వెళ్తారని, జైలుకు వెళ్లే నాయకుడికి ఓటు వేయవద్దని ఆయన ప్రజలకు పిలుపు ఇచ్చారు. ఐదేళ్ల నుంచి జగన్ రాష్ట్ర ప్రజలను జలగలా పీడిస్తున్నారని, ఆయనకు ఓటు వేయకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం పరితపిస్తున్న విజనరీ చంద్రబాబుకు పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం విడుదల చేసిన సూపర్ సిక్స్ మేనిఫెస్టోకు తోడుగా మొన్న టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేశాయని, వాటిలో తప్పులు వెతికి మాట్లాడే అర్హత వైసీపీకి లేదని అన్నారు. 4 సంవత్సరాల 11 నెలల జగన్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాలు ఎంతో నష్టపోయాయని, వైసీపీ నాయకులు తమ అరాచకాలతో ప్రజలను వేధించారని అన్నారు. జగన్ సభలను ప్రజలు బహిష్కరించడమే దీనికి నిదర్శనం అన్నారు.

జగన్ నరరూప రాక్షసుడు: ఎంపీ అభ్యర్థి నాగరాజు



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి నాగరాజు

కోడుమూరు (రూరల్), మే 2: జగన్ మోహన్‌రెడ్డి ప్రేమ, ఆప్యాయతలు తెలియని నరరూప రాక్షసుడని టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు అన్నారు. గురువారం రాత్రి వెంకటగిరి, ముడుమలగుర్తి గ్రామాల్లో కూటమి మేనిఫెస్టోను టీడీపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి సారథ్యంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బొగ్గుల దస్తగిరి ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో జగన్ తరఫున ఓట్లడిగిన చెల్లెలు షర్మిల ఇప్పుడు తన అన్నకు ఓటు వేయవద్దని ప్రజలను ప్రాధేయపడుతున్నారంటే ఆయన దుర్మార్గుడో గ్రహించాలని కోరారు. జగన్ తన సొంత బాబాయి హంతకులను కాపాడుతున్నారని మండిపడ్డారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం ద్వారా ప్రజల ఆస్తులను కూడా లాక్కుంటారని హెచ్చరించారు. గుండ్రేవుల, ఎల్లెల్సీ, వేదావతి, ఆర్డీఎస్ ప్రాజెక్టులను పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికి తాగునీరు, సాగునీరు అందించడానికి కృషి చేస్తామన్నారు. చంద్రబాబును సీఎం చేసుకుని దుర్మార్గ పాలనను అంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసీపీ నేతలు ఇసుక, ఎర్రమట్టిని అమ్ముకుంటూ దోచుకుంటున్నారని మండిపడ్డారు. విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ హత్యా రాజకీయాలకు అడ్డుకట్ట వేస్తామని అన్నారు. గ్రామాల్లో కుటుంబాల మధ్య గొడవలు పెట్టి లబ్ధి పొందడమే పనిగా పెట్టుకున్నారని, అటువంటి వారి ఆటలు సాగనీయనని తెలిపారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో క్రిష్టారెడ్డి, ఆకెపోగు రాంబాబు, వేల్పుల గోపాల్ వెంకటగిరి ఎంపీటీసీ సుజాత, ముడుమలగుర్తి సర్పంచ్ సువర్ణ, రాజు, నారాయణ, మధు, మల్లేష్ అయ్యస్వామి, గోకారి, గిరి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పండుటాకులపై పైశాచికం

- ఎండలో బ్యాంకుల చుట్టూ వృద్ధుల అవస్థలు
- జగన్ ప్రభుత్వ నిర్వాకంతో ఇబ్బందులు
- పింఛన్లను అడ్డుకుంటోందని టీడీపీపై నెపం
- తిప్పికొడుతున్న ప్రజలు, లబ్ధిదారులు
- జగన్ తీరుపై సర్వత్రా అసహనం

కోడుమూరు (రూరల్), మే 2: పింఛన్ డబ్బులు కోసం వృద్ధులు ఎర్రటి ఎండలో బ్యాంకులు చుట్టూ తిరుగుతున్నారు. ఈ బ్యాంకులో కాదు.. ఆ బ్యాంకులో అని, లబ్ధిదారుల బ్యాంకు ఖాతా సాంకేతిక లోపాలతో లాక్ అయిందని, రెండ్రోజులకు గానీ డబ్బులు రావంటూ బ్యాంకర్లు తిప్పకుంటున్నారు. సచివాలయాల దగ్గరకు వెళ్తే బ్యాంకులకే వెళ్లమంటున్నారు. మొత్తం మీద వయోభారంతో వృద్ధులు ఎండలకు ఎదురెళ్తూ వ్యయప్రయాసలు పడుతున్నారు. వేల మంది పింఛన్‌దారులను ఇబ్బంది పెట్టి, ఎన్నికల్లో సానుభూతి ఓట్లను పొందేందుకు వైసీపీ ఆడుతున్న నాటకంలో వృద్ధులు నానా యాతన పడుతున్నారు. వలంటీర్లు లేకుండానే గత నెల సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దకే పింఛన్లు పంపిణీ చేసిన అధికారులకు ఈ నెల ఎందుకు పంపిణీ చేయడం లేదో అర్థం కాని పరిస్థితి. పింఛన్ల పంపిణీని టీడీపీనే అడ్డుకుంటోందంటూ వైసీపీ ఆడుతున్న డ్రామాలను ప్రజలు ఎవరూ నమ్మడం లేదు.



బ్యాంకు ముందు వృద్ధుల పడిగాపులు



బ్యాంకు ముందు వృద్ధుల పడిగాపులు



బ్యాంకులో గుమికూడిన లబ్ధిదారులు

బ్యాంకులో జమ కాలేదన్నారు



పింఛన్ డబ్బులు బ్యాంకులో ఇస్తారంటే వెళ్లాను. అయితే బ్యాంకు వాళ్లు డబ్బులు పడలేదని తెలిపారు. దీంతో మండుటెండలో నడుచుకుంటూ సచివాలయం వెళ్లాను. సచివాలయం వాళ్లేమో డబ్బులు పడతాయి దిగులు పడొద్దని చెప్పారు. తీవ్రమైన ఎండలు ఉన్నాయి. పింఛన్ సొమ్ము ఇంటి దగ్గరే అందించి ఉంటే బాగుండేది.

ఆశీర్వాదమ్మ, ప్యాలకుర్తి

లబ్ధిదారులను ఏడిపిస్తూ..

పింఛను లబ్ధిదారుల డబ్బులు బ్యాంకు ఖాతాల్లో వేయడంతో వారంతా తమ సొమ్ములను తీసుకునేందుకు గురువారం ఉదయం నుంచే బ్యాంకులకు పరుగులు తీశారు. దీంతో బ్యాంకులన్నీ రద్దీగా కనిపించాయి. అయితే బ్యాంకుల వద్దకు వెళ్లిన చాలామంది లబ్ధిదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. తమ బ్యాంకు ఖాతాలకు సంబంధించి సరైన బ్రాంచ్ ఎక్కడ ఉందో తెలియకపోవడంతో చాలామంది అయోమయానికి గురయ్యారు. బ్యాంకుల అడ్రస్ కోసం మండుటెండల్లో అక్కడికి, ఇక్కడికి తిరిగాల్సి వచ్చింది. ఇక కొంతమంది బ్యాంకు చాలాకాలం నుంచి వాడకపోవడంతో లాక్ అయ్యాయి. దీంతో పింఛను డబ్బులు వారి ఖాతాలో పడినా.. దానిని మళ్లీ పునరుద్ధరించే వరకు డబ్బులు తీసుకోవడానికి వీల్లేదని తెలియడంతో ఉసూరుమన్నారు. ఇక చాలామంది అసలు తమ ఖాతాల్లో డబ్బులు పడ్డాయో లేదోనని ఆందోళన చెందుతూ బ్యాంకుల వద్ద పడిగాపులు కాశారు. అసలే జిల్లా వ్యాప్తంగా దాదాపు 15 రోజుల నుంచి ఎండలు విపరీతంగా మండిపోతున్నాయి. గురువారం ఎండ మరింత ఎక్కువగా ఉంది. దీంతో వృద్ధులు బ్యాంకుల వద్ద ఎండ, వేడిగాలులకు అల్లాడిపోయారు. తమలాంటి వృద్ధులను ఎండలో బ్యాంకుల చుట్టూ తిరిగేలా చేయడం వైసీపీ తగదని పింఛను లబ్ధిదారులు మండిపడుతున్నారు.

నేడు నంద్యాలకు నారా లోకేశ్



నంద్యాల (నూనెపల్లె), మే 2: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం నంద్యాలకు రానున్నారు. శుక్రవారం తెల్లవారుజామున నంద్యాల శివారులోని ఓ ఫంక్షన్ హాలులో బసచేయనున్నారు. ఉదయం నుంచి ఫంక్షన్ హాలులో వివిధ సామాజిక వర్గాల నాయకులతో ఆయన సమావేశమవుతారు. సాయంత్రం 4 గంటల నుంచి రాణి థియేటర్ వెనుకవైపు ఉన్న ప్రాంతంలో టీడీపీ శ్రేణులతో నారా లోకేశ్ సమావేశమై ఎన్నికల్లో తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేస్తారని టీడీపీ వర్గాలు వెల్లడించాయి.

క్రిష్ణగిరి ఎస్‌ఐ ఎన్నికల కోడ్ ఉల్లంఘన

పత్తికొండ, మే 2: క్రిష్ణగిరి ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి గురువారం యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారు. క్రిష్ణగిరి మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో ఎన్నికల ప్రచారం ముగించుకుని స్థానిక ఎమ్మెల్యే శ్రీదేవి కాన్వాయ్‌తో క్రిష్ణగిరికి బయలుదేరారు. ఎన్నికల నిబంధనల ప్రకారం స్థానిక పోలీసులు, ఎస్‌ఐలు పైలట్ వాహనం ఏర్పాటు చేయరాదు. అయితే క్రిష్ణగిరి ఎస్‌ఐ అత్యుత్సాహం చూపి అమకతాడు నుంచి క్రిష్ణగిరికి వెళ్లే కాన్వాయ్ ఎదుట తన వాహనాన్ని పైలట్ వాహనంగా వెళ్తూ ముందుకు సాగారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. కాగా ఈ విషయంపై పత్తికొండ ఆర్వో రామలక్ష్మికి వివరణ కోరగా.. ఇప్పటికే తమకు ఈ విషయంపై ఫిర్యాదు వచ్చిందన్నారు. విచారణ చేపట్టాలని పత్తికొండ డీఎస్పీని ఆదేశించామన్నారు. రాజకీయ నేతలకు ఇలా పైలట్ వాహనంగా వెళ్లడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని ఆర్వో తెలిపారు.




ఎమ్మెల్యే శ్రీదేవి వాహనానికి పైలట్‌గా వెళ్తున్న క్రిష్ణగిరి ఎస్‌ఐ వాహనం

వాయిస్ ఓకే.. ఓటు ఏదీ..?

నందికొట్కూరు, మే 2: చాలా మంది నాయకులకు వాయిస్ ఉంది కాని ఓట్లు లేవు. సభలు, సమావేశాలల్లో పాల్గొనే నాయకులు కొంత మంది వినసొంపుగా మాట్లాడుతుంటారు. కానీ వీరికంటూ ఓటు బ్యాంకు ఉండదు. పట్టుమని పది ఓట్లు కూడా వీరు వేయించ లేరు. ఉత్త మాటలతో కొంత మంది నేతలు ఎన్నికల్లో లబ్ధి పొందుతుంటారని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. ఇలాంటి వారి మాటలను నమ్ముకుంటే ఏ పార్టీ వారైనా గట్టెక్కేది కష్టమని అంటున్నారు.

● కోవర్టులున్నారు...జాగ్రత్త:
ప్రస్తుత అన్ని పార్టీల్లో కోవర్టులు ఉన్నారు. వీరితో పార్టీని ముందుకు నడిపించే వారు జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఇక్కడి మాటలు, అక్కడికి, అక్కడి మాటలు ఇక్కడికి కోవర్టులు చెబుతుంటారు. ఇద్దరి దగ్గర పైసలు లాగుతుంటారు. ఎన్నికలు వచ్చాయంటే కోవర్టులు వాలిపోతారు. దీనిపై పార్టీని నడిపించే వారు గుర్తించ లేకపోతున్నారని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. పార్టీ జెండాలను పట్టుకున్న వారి కంటే కోవర్టులు ఎక్కువగా లబ్ధి పొందుతున్నారు.

● మాటలు చెప్పే వారికే ప్రాధాన్యత:
పార్టీలో కమ్మని మాటలు చెప్పే వారికే నాయకులు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారు. వారి వల్ల పార్టీకి ఒరిగేది ఏమి ఉండదు. మాటకారులు నాయకులు నాలుగు మాటలు చెప్పి కాసులు తీసుకుని లబ్ధి పొందుతున్నారు. ఇవి అన్ని పార్టీల్లోను జరుగుతున్నాయి. పార్టీ కోసం నిరంతరాయంగా కష్టపడి పని చేసే వారికి ప్రయోజనం లేకపోగా కమ్మని మాటలు చెప్పిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయా పార్టీల్లో నిస్వార్థంగా పని చేస్తున్న కొందరు నాయకులు అంటున్నారు.



అట్టముక్కలతో సైకిల్ బొమ్మ

అభిమానం

వెలుగోడు పట్టణంలోని ఆసర్‌వీధికి చెందిన షబ్బీర్ హుసేన్ అనే ఓ యువకుడు టీడీపీకి వీరాభిమాని. దీంతో అట్టముక్కలు, పేపర్లతో ఓ సైకిల్‌ను తయారు చేశాడు. దానిపై ఓ వైపు టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి పేరు, మరో వైపు జై తెలుగు దేశమంటూ నినాదాలు రాసి ఎన్నికల ప్రచారంలో ఉపయోగిస్తున్నాడు. రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకే ఓటు వేయాలంటూ ప్రచారం చేస్తున్నాడు. -వెలుగోడు


సైకిల్‌ను తయారు చేసిన షబ్బీర్ హుసేన్


ప్యాపిలి మండలం బూరుగుల గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కోట్ల, కేఈ


మహానందిలో ప్రచార రథంపై మాట్లాడుతున్న బుడ్డా రాజశేఖరరెడ్డి


నందికొట్కూరు మండలం బొల్లవరం గ్రామంలో రోడ్ షో నిర్వహిస్తున్న నందికొట్కూరు టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య


ఉయ్యాలవాడ మండలం అల్లూరులో మాట్లాడుతున్న నంద్యాల టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి శబరి, పక్కన భూమా అఖిలప్రియ


నంద్యాలలోని 5వ వార్డులో మాట్లాడుతున్న టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి ఫరూక్


సంజమాల మండలం అక్కంపల్లెలో బీసీ జనార్దన్‌రెడ్డికి గజమాలతో స్వాగతం

కాటసాని-చల్లా కోటలకు బీటలు..!






- ● 40 ఏళ్ల హవాకు చెక్ పెట్టిన బీసీ జనార్దన్‌రెడ్డి
- ● ఆయా గ్రామాల్లో ఓటర్ల చైతన్యం
- ● అవుకు మండలంలో పట్టు బిగించిన టీడీపీ

అవుకు, మే 2: అవుకు మండలంలో ఈ ఎన్నికల్లో కాటసాని, చల్లా కోటలకు బీటలు వారుతున్నాయి. మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో 50,452 మంది జనాభా ఉండగా ఓటర్లు 42,679 మంది ఉన్నారు. నాలుగు దశాబ్దాలుగా కాటసాని కుటుంబీకులకు పట్టున్న గుండ్లశింగవరం, నిచ్చెనమెట్ల, కోనాపురం, రామవరం, లింగంబోడు, గోకులదిన్నె, అన్నవరం గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో 4,669 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే దివంగత చల్లా రామకృష్ణారెడ్డికి పట్టున్న కొండమీద పల్లెలకు ఉప్పలపాడు, జూనుంతల, పిక్కిళ్లపల్లె తండా, మారెమడుగుల, కొండమనాయినిపల్లె గ్రామాల్లో 4663 మంది ఓటర్లు ఉన్నారు. బనగానపల్లె అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి ఈ ఎన్నికల్లో వ్యూహాత్మకంగా పావులు కదిపారు. గతంలో కాటసాని రామిరెడ్డి గెలుపులో కీలకంగా వ్యవహరించిన కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, కాటసాని రామిరెడ్డి సోదరుడు కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి వైసీపీని వీడి బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. అవకు పట్టణంలో కాటసాని రామిరెడ్డి ముఖ్య అనుచరుడు వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిన మద్దిలేటిగౌడ్ ఇటీవలే వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరి చేరికలతో 40 సంవత్సలుగా కాటసానికి పట్టు ఉన్న గ్రామాల్లో ఢీ అంటే ఢీ అనే పరిస్థితి నెలకొంది. అలాగే చల్లా కుటుంబం నుంచి చల్లా రామకృష్ణారెడ్డి సోదరుడు చల్లా విజయభాస్కర్‌రెడ్డి ఆయన బావమరిది మెట్ల రామిరెడ్డి వైసీపీని వీడి బీసీ జనార్దన్‌రెడ్డితో కలసి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. కాటసాని, చల్లాకు పట్టున్న గ్రామాల్లో ఇతర పార్టీల నాయకులు గతంలో ప్రచారానికి వెళ్లే సాహసం చేసేవారు కాదు. ఇతరులు పోటీ చేసే అభ్యర్థుల తరఫున ఏజెంట్లు కూడా కూర్చున్న దాఖలాలు లేవు. ఓటింగ్ కాటసాని, చల్లాకు ఏకపక్షంగా జరిగేది. బీసీ జనార్దన్‌రెడ్డి చక్రం తిప్పడంతో ఈ ఎన్నికల్లో కాటసాని రామిరెడ్డికి పట్టున్న గ్రామాల్లో కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి ముమ్మరంగా బీసీకి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అలాగే చల్లా కుటుంబీకులకు పట్టున్న గ్రామాల్లో సోదరుడు చల్లా విజయభాస్కర్ రెడ్డి, మెట్ల రామిరెడ్డి, టీడీపీకి మద్దతుగా ప్రచారం చేశారు. దీనికి తోడు బీసీ జనార్దన్‌రెడ్డి గెలుపును సవాల్‌గా తీసుకున్న టీడీపీ సీనియర్ నాయకుడు ఐవీ పక్కీరారెడ్డి అవుకు, కొలిమిగుండ్ల మండలాల్లోని ముఖ్య నాయకులు వైసీపీ నుంచి టీడీపీలో చేరి కీలక పాత్ర వహిస్తున్నారు. మండలంలోని ప్రథమ, ద్వితీయ శ్రేణి నాయకులు వైసీపీని వీడి టీడీపీలో చేరుతుండడంతో వైసీపీలో అలజడి నెలకొంది. కాటసాని, చల్లాకు పట్టున్న గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ తరుపున ఏజెంట్లను కూర్చొబెట్టే విధంగా బీసీ కార్యాచరణ చేశారు. దశాబ్దాలుగా ప్రచారానికి, ఓటు హక్కుకు నోచుకోని గ్రామాల్లో ఈ ఎన్నికల్లో ఓటర్లలో చైతన్యం నింపే విధంగా బీసీ ప్రణాళికలు రూపొంది అమలు చేసేందుకు సిద్ధమయ్యారు. గతంలో ఏకపక్షంగా ఓటింగ్ జరిగే గ్రామాల్లో బీసీ చొరవతో ఈ ఎన్నికల్లో ఓటర్లు తమకు నిచ్చిన అభ్యర్థికి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం రావడంతో ఓటర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కీలకమైన అవుకు మేజర్ పంచాయతీలో 10,594 మంది ఓటర్లు, రామాపురంలో 4,865 మంది ఓటర్లు ఉన్నారు. ఈ రెండు పంచాయతీల్లో ఇప్పటికే టీడీపీ గట్టి పట్టు సాధించింది. బీసీ జనార్దన్‌రెడ్డి మండలంలో మెజార్టీకి బీసీ యత్నాలు ప్రారంభించారు.



లక్ష్యం నీరుగారింది..!


హరినగరం మంచినీటి పథకం

రుద్రవరం, మే 2: రుద్రవరం మండలం పరిధిలోని హరినగరం మంచినీటి పథకానికి తుండ్లవాగు రిజర్వాయరు నుంచి అనుసంధానం చేశారు. ఈ పథకాన్ని 2009 జనవరి 20న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే గంగుల ప్రతాప్ రెడ్డి ప్రారంభించారు. రూ.8.10 కోట్లతో ఫేజ్1 కింద ఒకటి, ఫేజ్-2,3 కింద మరొకటి రెండు మంచినీటి పథకాలు నిర్మించారు. ఈ పథకాల ద్వారా 41 గ్రామాలకు తాగునీరు అందించాల్సి ఉండగా ప్రస్తుతం 12 గ్రామాలకు అరకొరగా నీరందుతోంది. పుష్కలంగా నీరందుతుందని ప్రజలు ఆశతో ఎదురుచూశారు. వారి ఆశ నిరాశే అయింది. మంచినీటి పథకానికి ఐదేళ్లలో పైసా విదల్చకుండా మమ అనిపించిన ఘనత ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డికే దక్కింది. వైఎస్ తనయుడు అయిన ప్రస్తుత సీఎం ఆ మంచినీటి పథకానికి తూట్లు పొడిచారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నీటిని సరఫరా చేయరా



హరినగరం మంచినీటి పథకం నుంచి రుద్రవరానికి పైపులైను అనుసంధానం చేశారు. రుద్రవరంలో సంప్, పంపింగ్ రూము నిర్మించారు. అవి శిథిలమయ్యాయి. రక్షిత మంచినీరు అందడంలేదు. కోట్లాది రూపాయలు నిజదులు వృథా అయ్యాయి.
- కొమ్మలపాటి రాజారావు, రుద్రవరం

రక్షిత మంచినీరు అందించడంలో నిర్లక్ష్యమా?



హరినగరం మంచినీటి పథకానికి రుద్రవరానికి అనుసంధానం చేస్తూ పైపులైను ఏర్పాటు చేశారు. ప్రజలకు రక్షిత మంచినీరు అందించడంలో నిర్లక్ష్యం ఎందుకు? నీరు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికే తొమ్మిదేళ్లు ఎదురు చూశాం. ఇక ఎన్నేళ్లు ఎదురు చూడాలి.
- శ్రీనివాసులు, రుద్రవరం


వృథాగా పోతున్న మంచినీరు

అక్రమాలపై సీ విజిల్ మోగించండి

వంద నిమిషాల్లోనే సమస్యకు పరిష్కారం

కొలిమిగుండ్ల రూరల్, మే 2:

ఎన్నికలను సక్రమంగా, సజావుగా నిర్వహించేందుకు భారత ఎన్నికల సంఘం తీసుకవచ్చిన సీ విజిల్ యాప్‌ను బాధ్యత కలిగిన పౌరులందరూ ఉపయోగించవచ్చు. ఫిర్యాదు అందిన వంద నిమిషాల్లో చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం చెబుతోంది. ముఖ్యంగా ఈ యాప్ ద్వారా అధికార పార్టీలు ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసే అక్రమాలపై ఫిర్యాదు చేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని మేధావులు సూచిస్తున్నారు.



ఎలా ఉపయోగించాలి..

పౌరులు ఎక్కడైనా తమ కళ్ల ముందు ఎన్నికల ప్రక్రియలో అక్రమం జరుగుతోందని భావిస్తే ఆ దృశ్యాన్ని తమ చేతిలోని మొబైల్ ఫోన్ ద్వారా ఫొటో లేదా రెండి నిమిషాల నిడివి ఉండేలా వీడియోను చిత్రీకరించాలి. (ఓటర్లను బెదిరించడం, డబ్బు, మద్యం, వస్తువుల పంపిణీ, అనుమతి లేకుండా పోస్టర్లు వేయడం, రాజకీయ నాయకలు వ్యక్తిగత దూషణలు, రాత్రి 10గంటలు దాటినా ప్రచారం చేయడం లాంటివి) దాన్ని మీ ఫోన్‌లో ఉన్న సీ విజిల్ యాప్‌లో వెంటనే అప్‌లోడ్ చేయాలి. అక్రమం గురించి రెండు వాఖ్యలు కూడా రాసే అవకాశం ఉంటుంది. అప్‌లోడ్ చేసే సమయంలో జీపీఎస్ ఆన్‌లో ఉంచుకోవాలి. ఇది వెంటనే జిల్లా కేంద్రంలోని ఎన్నికల క్రంటోల్ రూమ్‌కు చేరుతుంది. సంఘటన ఎక్కడ జరిగింది అన్నది వారికి ముందే తెలుస్తుంది కాబట్టి ఆ ప్రాంతంలోని ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు సమాచారం వెళ్తుంది. వెంటనే వారు అక్కడికి చేరుకొని ఘటనపై కేసు నమోదు చేస్తారు. ఈ మొత్తం వివరాలను డిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘం నేషనల్ గ్రీవెన్స్ పోర్టల్‌కు నివేదిస్తారు. వంద నిమిషాల్లో అధికారులు తీసుకున్న చర్యలను వివరిస్తూ అప్‌లోడ్ చేసిన వ్యక్తి ఫోన్‌కు సందేశం పంపిస్తారు. పౌరుడి వివరాలను సైతం ఎన్నికల కమీషన్ అత్యంత గోప్యంగా ఉంచుతుంది. ఇంత మంచి అవకాశాన్ని ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకొని ఎన్నికల అక్రమాలను అరికట్టాలని రాజకీయ విశ్లేషకులు మేధావులు సూచిస్తున్నారు.

ఐదేళ్ల పాలనలో అసంపూర్తి పనులే


కోటకొండ సమీపంలో తెలుగుగంగ ప్రధాన కాల్వ గట్టుపై పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్ (ఫైల్)

రుద్రవరం, మే 2 : తెలుగుగంగ ప్రధాన కాల్వ గట్టు ఇన్‌స్పెక్షన్ ట్రాక్ (తనిఖీ చేసే రహదారి) పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రుద్రవరం మండలం కోటకొండ సమీపంలో తెలుగుగంగ ప్రధాన కాల్వ గట్టు వెంట చేపట్టిన పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి. చేపట్టారు. అలాగే గట్టు బాండు స్ట్రెంత్ పనులు కూడా నిలిచిపోయాయి. ఈ పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో అధికారులకు తెలియాలి. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు వద్ద నుంచి 0 కి.మీ నుంచి 40 కి.మీ వరకు గట్టు బలోపేతం, ఇన్‌స్పెక్షన్ ట్రాక్ పనులు చేయాల్సి ఉంది. 0 నుంచి 18 కి.మీ. సిమెంటు లైనింగ్ పనులు అక్కడక్కడా సిమెంటు లైనింగ్ పనులు చేయడానికి సుమారు రూ.239 కోట్లతో టెండర్లు పిలిచారు. గట్టు వెంట బాండు స్ట్రెన్త్ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ఇన్‌స్పెక్షన్ ట్రాక్ కూడా నిలిచిపోయింది. కాగా తెలుగగంగ ప్రధాన కాల్వ గట్టు ఇన్‌స్పెక్షన్ ట్రాక్ బాండు బలోపేతం పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని డీఈ రవీంద్ర తెలిపారు.


ప్రధాన కాల్వ గట్టునే మట్టి తవ్విన దృశ్యం

నేతకో సొంత సర్వే!

- ● వ్యక్తిగతంగా సర్వే చేయించుకుంటున్న అభ్యర్థులు
- ● పార్టీలు చేయిస్తున్నా...సెకండ్ ఓపీనియన్ కోసం..
- ● నివేదికల ఆధారంగా అభ్యర్థుల వ్యూహాలు
- ● బెట్టింగ్‌ల కోసం కొన్ని సంస్థల సర్వేలు!



నందికొట్కూరు, మే 2: 'నియోజకవర్గంలో నా పరిస్థితేంటి? ఏ వర్గం ప్రజల్లోనైనా నా పట్ల వ్యతిరేకత ఉందా? ఎవరైనా నాకు వ్యతిరేకంగా పని చేస్తున్నారా? ఎవరెవరిని బుజ్జగించాలి? నియోజకవర్గంలో పార్టీలకతీతంగా ఓటర్లను ఎక్కువగా ప్రభావితం చేసే వ్యక్తులెవరు? ప్రచారాన్ని ఏ విధంగా నిర్వహించాలి?' అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులంతా ఇప్పుడు ఈ అంశాలను తెలుసుకునే పనిలో పడ్డారు. ఇందు కోసం సొంతంగా సర్వే చేయించుకుంటున్నారు. అధిష్టానాలు ఆయా పార్టీల తరపున సర్వేలు చేయిస్తున్నా.. అభ్యర్థులు కేవలం వాటిపైనే ఆధారపడటం లేదు. పార్టీ అధిష్టానాలు చేయించే సర్వేలు గెలుపోటములు, మరికొన్ని అంశాలకే పరిమితమవుతున్నాయి. దీంతో అన్ని అంశాలను తెలుసుకునేందుకు వ్యక్తిగతంగా సర్వే చేయించుకుంటూ ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నారు. సర్వే సంస్థలిచ్చే ఇన్‌పుట్స్ ఆధారంగా వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నారు. కచ్చితంగా గెలవాలనుకునే నేతలంతా ఇలా సెకండ్ ఒపీనియన్ కోసం సర్వే సంస్థలను ఆశ్రయిస్తున్నట్లు ఏజెన్సీ వర్గాలు చెబుతున్నాయి. టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్‌కు చెందిన అభ్యర్థులు ఇలా సొంతంగా సర్వే చేయించుకునేందుకు పొరుగు రాష్ట్రంలోని ఓ ప్రధాన సర్వే సంస్థను ఆశ్రయించినట్లు తెలుస్తోంది.

● సర్వేలనే నమ్ముకుంటున్న పార్టీలు

వాస్తవానికి రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ ప్రజానాడిని పట్టేందుకు సర్వేలనే నమ్ముకుంటున్నాయి. క్షేత్రస్థాయిలో బలాలు, బలహీనతలేంటో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ముఖ్యంగా అధికార వైసీపీ అయితే ఇంటెలిజెన్సీ వర్గాలతో పాటు పలు సంస్థలతో ఎప్పటికప్పుడు ప్రజాభిప్రాయాన్ని తెలుసుకుంటోంది. టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు కూడా తమ వ్యూహకర్తలపైనే ఎక్కువగా ఆధారపడుతోంది. వారు ఇచ్చిన సర్వేల ఆధారంగానే హైకమాండ్ అభ్యర్థులను ఎంపిక చేసింది. గతంలో ఎప్పుడూ రాజకీయ పార్టీలు ఇంతలా సర్వేలపై ఆధారపడలేదు. పోటీ చేయాలనుకున్న కొందరు నేతలు మాత్రమే సర్వే చేయించుకునేవారు. ఎన్నికల్లో పోటీ అంటే కోట్ల రూపాయల ఖర్చుతో కూడుకున్న పని కావడంతో ముందుగా ఐదారు లక్షల రూపాయలతో సర్వే చేయించుకుని, తనకు గెలుపు అవకాశాలున్నాయంటేనే బరిలోకి దిగేవారు. కానీ, ఈసారి పార్టీలే సర్వేలు చేయిస్తున్నాయి.

● అంతుచిక్కని ప్రజానాడి

ఈసారి సర్వేల్లో కూడా పూర్తి కచ్చితత్వంతో కూడిన అభిప్రాయాలు వెల్లడి కావడంలేదని ఆయా సంస్థలే చెబుతున్నాయి. క్షేత్రస్థాయిలో ప్రజానాడిని పట్టుకోలేకపోతున్నామని ఓ సర్వే సంస్థ ప్రతి నిధి వెల్లడించాడు. ఓటర్లు మనసులో ఒక నిర్ణయంతో ఉండి...పైకి మాత్రం మరోలా చెబుతున్నారని అంటున్నారు. అంతేకాకుండా తమ అభిప్రాయాన్ని స్పష్టంగా బయటపెడితే తమ ఐడెంటిటీ ఎక్కడ బయటపడుతుందో, దాని వల్ల మున్ముందు ఏ సమస్య వస్తుందోనన్న భయంతో కూడా సరైన సమాచారం ఇవ్వడం లేదంటున్నారు. ఓటర్లు చెప్పేదానికి, ఓటు వేసేవాడికి మధ్య కనీసం 2.5శాతం తేడా ఉండే అవాశాలున్నాయని సర్వే సంస్థలు చెబుతున్నాయి.

● బెట్టింగ్‌ల కోసం సర్వేలు

ఏపీ ఎన్నికలపై బెట్టింగ్‌లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో రెండోసారి వైసీపీ అధికారంలోకి వస్తుందా? లేక టీడీపీ అధికారంలోకి వస్తుందా? అన్నదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. దీనిపై ఇప్పటికే పందెంరాయుళ్లు రంగంలోకి దిగి గెలిచే పార్టీ ఏదో తెలుసుకునేందుకు సర్వే సంస్థల యజమానులను కలుస్తున్నట్లు సమాచారం. ఏజెన్సీలిచ్చే నివేదికను బట్టి కోట్ల రూపాయల బెట్టింగ్‌లు జరగబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు తెలంగాణకు చెందిన కొందరు బెట్టింగ్ రాయుళ్లు కూడా సర్వే సంస్థలను ఆశ్రయించినట్లు తెలుస్తోంది.

ఓటరు కాయిస్

● జగన్ ఏం చేశారు..?



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో నిరుద్యోగులకు ఏమి చేశారు? ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్ క్యాలెండర్ అని వాగ్దానం చేశారు. అది ఇప్పటి వరకు అమలు కాలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇవ్వలేదు. ఎన్నికల ముందు డీఎస్సీ ప్రకటించారు. ఎన్నికల కోడ్ రావడంతో అది కాస్త మరుగున పడింది. మళ్లీ తనను గెలిపిస్తే డీఎస్సీ విడుదల చేస్తానని ఊసరవెల్లి మాటలు చెబుతున్నారు. ఇలాంటి వారిని నమ్మితే నిరుద్యోగులు మరో ఐదేళ్ల ఉద్యోగాలు లేక ఇంట్లో కూర్చోవాల్సిందే.

-షేక్ యూనుస్‌బాషా, కొత్తపేట, కర్నూలు

● పరిశ్రమలు ఎక్కడ వచ్చాయి



పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఎక్కడ నెరవేరింది? జిల్లాలో ఓర్వకల్లు పారిశ్రామిక హబ్, ఎమ్మిగనూరు టెక్స్‌టైల్ పార్కు, ఆదోని జిన్నింగ్ మిల్లు, పత్తికొండ జ్యూస్ సాప్ ఫ్యాక్టరీ, ఐటీ టీపీఓ కంపెనీలను ఏర్పాటు చేయడంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. జిల్లా నుంచి ప్రతి సంవత్సరం ఉద్యోగ, ఉపాధి లేక ఆరు లక్షల మంది వలస వెళ్తున్నారు. ఇందులో నిరుద్యోగులు ఇతరులు ఉన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రధానంగా నిరుద్యోగులు, యువతకు ఎలాంటి మేలు చేయలేదు. కేవలం సచివాలయం, వలంటీర్ల ద్వారానే తన ప్రభుత్వాన్ని నడిపించుకున్నాడు.

- సాబోలు కరుణాకర్‌రావు..లక్ష్మీనగర్, కర్నూలు

● గతంలో ఇంతలా ధరలు లేవు



ఈ ప్రభుత్వం పథకాలు ఇస్తున్నామంటోంది. అయితే పెంచిన చార్జీలు, ధరలతో సామాన్యుల నడ్డి విరుగుతోంది. నిత్యావసరాల ధరలు గతంలో ఇంతలా లేవు. పప్పు దినుసులు, నూనెలు, బేడలు, విద్యుత్ చార్జీలు, గ్యాస్ ధరలు మండుతున్నాయి. అసలే కరువు పరిస్థితులతో కూలీ బతుకుల పరిస్థితి దారుణంగా ఉంది. గతంలో ఇంతేసి ధరలు లేవు. కరెంటు చార్జీలు కూడా తక్కువగా ఉండేవి.

- రాజేశ్వరి, గృహిణి, ముడుమలగుర్తి

విధిలేక నడుపుతున్నాం



ఆటో కార్మికుల పరిస్థితి దారుణంగా ఉంది. డీజిల్ రేటు సెంచరీ దాటింది. టీడీపీ హయాంలో రూ.60 మాత్రమే ధర నడిచింది. ఇప్పుడు పక్కన కర్ణాటక రాష్ట్రంలో డీజిల్ ధర ఏపీ కన్నా తక్కువే. ఆటో డ్రైవర్ల రోజువారి సంపాదనలో డీజిల్‌కే అధిక భాగం కేటాయించాల్సిన పరిస్థితి వస్తోంది.

- హనుమంతు,
ఆటో డ్రైవర్, వర్కూరు, కోడుమూరు రూరల్

చెల్లని ఓట్లకు కాలం చెల్లింది..



ఆదోని, మే 2: ఈవీఎంల వినియోగంతో చెల్లని ఓట్లంటూ ఉండవు. ఎన్నికల్లో ఈ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాన్ని దేశంలో తొలిసారిగా 1982, మే 19న వినియోగించారు. కేరళలోని పారూర్ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో ఈవీఎంలను ప్రయోగాత్మకంగా వినియోగించారు. గతంలో ఎన్నికలప్పుడు బ్యాలెట్ పేపరులో అభ్యర్థుల గుర్తులపై స్వస్తిక్ ముద్రతో ఓటు వేసేవారు. ఆ సమయంలో ఓటర్లు తెలియక చేసే పొరపాట్ల వల్ల వారు వేసిన ఓట్లు కొంత మందివి చెల్లకుండా పోయేవి. ఓటు గుర్తుపై ముద్ర సరిగ్గా పడకపోవడం, అభ్యర్థి గుర్తుకు కేటాయించిన పరిధి గడి దాటి పడటం, లెక్కింపు సమయంలో అధికారులు నిశితంగా పరిశీలించి.. ఆ ఓటు ఎవరికి ఇవ్వాలనేది నిర్ణయించే వారు. కొన్నిసార్లు ఏ అభ్యర్థికి ముద్ర దగ్గరగా ఉందనే విషయాన్ని స్కేలు పెట్టి కొలిచి నిర్ణయించే వారు. మరి కొందరు టు వేయకుండానే బ్యాలెట్ పత్రాన్ని మడిచి బాక్స్‌లో వేసే వారు. ఇలా పొరపాట్లు జరిగిన వాటిని అధికారులు చెల్లని ఓట్లుగా గతంలో పరిగణించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఈవీఎంలు వాడకంలోకి వచ్చాక చెల్లని ఓట్లనే ప్రశ్నేలేకుండా పోతోంది. ప్రస్తుతం మీటను నొక్కాలి. ఒకవేళ పోటీ చేస్తున్న ఏ అభ్యర్థి నచ్చకపోతే నోటా నొక్కవచ్చు.

పోలింగ్ ఆలస్యమైతే...



కర్నూలు(కలెక్టరేట్), మే 2: ఏ కారణాలతోనైనా పోలింగ్ ప్రారంభం కావడం ఆలస్యమైతే సమయం పెంచరు. నిర్ణీత సమయానికి క్యూలైన్‌లో ఉన్నవారికి ఓటు వేసేందుకు అనుమతిస్తారు. ఎంత రాత్రి అయినా సరే వారంతా ఓటు వేసే వరకు పోలింగ్ కొనసాగుతుంది. పోలింగ్ కేంద్రంలో కానీ కేంద్రానికి వంద మీటర్ల పరిధిలో అభ్యర్థితోపాటు మరే వ్యక్తి కూడా ఫలానా గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేయకూడదు. గ్రామాలు, పోలింగ్ కేంద్రాల పరిధిలో ఏదైనా కారణాలతో ఓటింగ్ బహిష్కరిస్తే రీ పోలింగ్ నిర్వహించరు. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడానికి అభ్యర్థి గన్‌మెన్‌కి అనుమతి లేదు. ఒకవేళ ఓటు వేసేందుకు గన్‌మెన్ వస్తే.. ఎన్నికల నిబంధనల మేరకు తన వద్ద ఉన్న ఆయుధాన్ని పోలీసుల వద్ద ఉంచి ఓటు వేసి తిరిగి వచ్చి తీసుకోవాలి.

పెద్ద నోటు.. ఈసారి లోటు..



కర్నూలు(న్యూసిటీ) మే 2: ఎన్నికలు వచ్చాకంటే నగదు, మద్యానిదే కీలకపాత్ర. నోటిఫికేషన్ మొదలు పోలింగ్ కేంద్రానికి వెళ్లే వరకు ఈ రెండే ప్రభావం చూపుతాయి. ఓటర్లను దారిలోకి తెచ్చుకోవాలన్నా, ఫిరాయింపులు అడ్డుకోవాలన్నా వీటి అవసరం ఎంతో ఉంది. జేబులో చేయి పెట్టి నోటు తీస్తే ఆ కట్టంతా ఇవ్వాలని అడిగే రోజులు ఇవి. అభ్యర్థుల అదృష్టమో, ఓటరు దురదృష్టమో తెలియదు కానీ.. ఈసారి ఎన్నికల్లో పెద్ద నోట్లు కనిపించకుండా పోయాయి. 2014 ఎన్నికల్లో పెద్ద నోటు(వెయ్యి నోటు) రాజ్యమేలింది. ఆ తరువాత నోట్ల రద్దుతో ఆ నోటు కనిపించలేదు. 2019 ఎన్నికల నాటికి రూ.2000 నోటు వచ్చింది. ఇప్పుడు అదీ కనిపించలేదు. జేబులో చేయి పెడితే రూ.500 నోటు లేదా రూ.200 నోటు మాత్రమే వస్తున్నాయి. ఈ క్రమంలో ఒకటో రెండో అలాంటి నోట్లు ఇచ్చినా ఓటరు సంతృప్తి పడే రోజులు పోయాయని అభ్యర్థులు చెబుతున్నారు.

బొగ్గుల దస్తగిరికి గన్‌మెన్ కేటాయింపు

కర్నూలు(రూరల్), మే 2: టీడీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరికి ప్రభుత్వం గన్‌మెన్లను కేటాయించింది. ఆయన సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న తరుణంలో ఎస్పీ కృష్ణకాంత్ వన్ ప్లస్ వన్ చొప్పున ఏర్పాటు చేయించారు. ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం గన్‌మెన్ వెంకట్ వీధుల్లో చేరారు. అనంతరం దస్తగిరి వెంట అంగరక్షకుడిగా ప్రచారానికి వెళ్లారు. కోడుమూరు నియోజికవర్గంలో కొన్ని సమస్యాత్మకమైన ప్రాంతాలను దృష్టిలో పెట్టుకుని దస్తగిరికి ప్రభుత్వం ఇద్దరేసి చొప్పున గన్‌మెన్లను కేటాయించింది. ఆయనతో పాటు కర్నూలు పార్లమెంట్ టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి కురువ నాగరాజుకు కూడా ఇద్దరు గన్‌మెన్లను ఏర్పాటు చేశారు.

సోషల్ వార్

●ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్న ప్రతిపక్షాలు ● స్వీయ రక్షణలో అధికార పార్టీ నాయకులు

ఆదోని, మే 2:

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో రాజకీయ పార్టీల నాయకులు సోషల్ మీడియాపై దృష్టి సారించారు. ఓ వైపు ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రజల్లో ఉంటూనే ప్రత్యర్థుల ఆటకట్టించేందుకు ప్రణాళికలు రచిస్తున్నాయి. తాము చేసిన పనులు ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు, తమను విమర్శించే వారి నుంచి స్వీయ రక్షణ పొందేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. వైసీపీ, కాంగ్రెస్, బీజేపీలు తమ తమ పరిధిలో ప్రత్యేకంగా సోషల్ మీడియా కార్యకర్తలను నియమించుకుంటూ వార్‌కు సిద్ధం చేస్తున్నారు. కౌంటర్లకు ప్రతి కౌంటర్లు ఇచ్చేలా సోషల్ మీడియా టీమ్‌కు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నారు. ప్రత్యర్థుల ఆటలు సాగకుండా, కట్టడి చేయడంతోపాటు, ప్రస్తుత పరిస్థితులను తమకు అనుకూలంగా మల్చుకునే పద్ధతులను అవలంబిస్తున్నారు.

● ప్రత్యర్థులకు చెక్ పెట్టే యోచన..



వైసీపీ నాయకులు తాము చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రయత్నిస్తుండగా, వివిధ సంక్షేమ పథకాల్లోని లోసుగుల ఆధారంగా ప్రజలను అధికార పార్టీకి దూరం చేసేందుకు ప్రతిపక్షాలు కార్యాచరణ చేపడుతున్నాయి. ఇందులో భాగంగా ప్రతిపక్ష పార్టీలైన టీడీపీ, కాంగ్రెస్, బీజేపీలు సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ ప్రజాక్షేత్రంలోకి వెళుతున్నాయి. ఐదేళ్ల కాలంలో వైసీపీ అధిష్టానం ఇచ్చిన హామీలు, నెరవేరని వాగ్దానాలపై ప్రజలకు వివరిస్తూ పార్టీకి వ్యతిరేకులుగా మార్చే ప్రయత్నం చేస్తున్నాయి. దీంతో అప్రమత్తమైన అధికార పార్టీ నేతలు ప్రతిపక్ష నేతల పరపతిని తగ్గించే పనికి శ్రీకారం చుట్టాయి. చర్చలు, సమావేశాలు, సభల్లోనూ ఒకరిపై ఒకరు. విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటూ తమ ఉనికిని చాటుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రత్యర్థులను ఎంత బాగా విమర్శిస్తే అంత ఎక్కువ లాభం జరుగుతుందని నమ్ముతున్న నాయకులు సోషల్ మీడియాపై నిమగ్నమవుతున్నారు.

● ప్రతిఫలం ఆశతో..

రాజకీయ పార్టీలు తాము ఏర్పాటు చేసుకుంటున్న సోషల్ మీడియా గ్రూపుల్లో చేరేలా యువతకు ఆఫర్లు చేస్తున్నాయి. పార్టీ కోసం కష్టపడితే భవిష్యత్తులో మంచి ప్రతిఫలం ఉంటుందని ఆశ చూపుతున్నారు. ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పత్తికొండ నియోజకవర్గాల పరిధిలో వేల సంఖ్యలో యువతను సోషల్ మీడియా గ్రూపుల్లోకి చేర్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. క్షేత్రస్థాయిలో పనిచేసే క్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులను కలుపుకొని సమన్వయంతో ముందుకు వెళ్లే లా దిశా నిర్దేశం చేస్తున్నారు. పని చేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని చెబుతున్నారు. వైసీపీలో ఈ పరిస్థితి మరింత వేగంగా విస్తరిస్తోంది. ఆదోని నియోజకవర్గంలో పెద్ద సంఖ్య లో సోషల్ మీడియా ప్రతినిధులను తయారు చేసే పనిలో ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అనుచరులు నిమగ్నమయ్యారు.

● టీం సభ్యులకు ప్రత్యేక శిక్షణ..

ప్రత్యర్థులను ఎదుర్కొనేందుకు సోషల్ మీడియా టీం సభ్యులకు ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డికి చెందిన ఓ యువ నాయకుడుతో శిక్షణ ఇప్పిస్తున్నారు. రెండు రోజుల క్రితం వందల మందికి శిక్షణ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా వైసీపీ చేపడుతున్న పలు సంక్షేమ పథకాలపై నిపుణులు వివరించారు. అలాగే టీడీపీ అధికారంలోకి వస్తే వైసీపీ పథకాలను ఎత్తివేస్తామని చెబుతున్నారు. అధికార పార్టీ రైతు వ్యతిరేక నిర్ణయాలు, ధరలు పెరుగుదలపై ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. బీజేపీ సైతం సోషల్ మీడియా వేదికను బలోపేతం చేసే పనిలో నిమగ్నమైంది. సోషల్ మీడియా వేదికగా ప్రత్యర్థులు చేస్తున్న ఆరోపణలు, ప్రచారాలను వ్యక్తిగతంగా కాకుండా విశ్లేషణాత్మకంగా తిప్పికొట్టేలా పార్టీ శ్రేణులకు నాయకులు సూచనలు చేస్తున్నారు.

వలంటీర్లకు తాయిలాలు

ఓటేస్తే రూ.3 వేలు... వేయిస్తే రూ.3 వేలు

కర్నూలు (న్యూసిటీ), మే 2: ఇంతకాలం ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా చెప్పుకొస్తున్న వలంటీర్లకు వైసీపీ నాయకులు తాయిలాలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఎలాగైనా తమ అభ్యర్థిని గెలిపించుకోవాలనే నిర్ణయంతో వలంటీర్ల వైపు మొగ్గుచూపుతున్నారు. వలంటీర్లను ఎన్నికల విధుల్లో ఉపయోగించరాదని ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిన సంగతి విదితమే. రాజీనామాలు చేసి ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని.. వలంటీర్లను వైసీపీ నేతలు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. కర్నూలు అసెంబ్లీ పరిధిలో 33 వార్డులు ఉండగా మొత్తం 1200 మంది వలంటీర్లు ఉన్నారు. ఇప్పటి వరకు 20 మంది రాజీనామా చేశారు. ఎలాగైనా వలంటీర్లను అడ్డం పెట్టుకుని తమ పార్టీకి ఓటు వేయించుకోవాలనే ఉద్దేశంతో వలంటీర్లకు తాయిళాలు ఇచ్చేందుకు



ముందుకు వస్తున్నారు. మొన్నటి వరకు టీడీపీ ప్రభుత్వం వస్తే వలంటీర్లకు తొలగిస్తాదని ప్రచారం చేసిన వైసీపీ నేతలకు టీడీపీ అధినేత వలంటీర్లకు ఇచ్చిన భరోసాతో ఒక్కసారిగా దిమ్మెతిరిగి మైండ్ బ్లాక్ అయింది. ఈ క్రమంలో మొదట్లో వైసీపీ నేతల మాటలు విని రాజీనామాలు చేసిన వలంటీర్లు ఎందుకు చేశామా అని మధనపడుతున్నారు. మిగిలి ఉన్న వలంటీర్లు రాజీనామా చేసేందుకు ముందుకు రావడం లేదు.

● పెరుగుతున్న టీజీ భరత్ గ్రాఫ్‌తో ఉక్కిరిబిక్కిరి

కర్నూలు అసెంబ్లీ పరిధిలో టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ గ్రాఫ్ రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. టీజీ భరత్‌కు ప్రతి వార్డులో జనం బ్రహ్మరథం పడుతున్నారు. ఆయనకు వస్తున్న ఆదరణను వైసీపీ నాయకులు చూడలేకపోతున్నారు. దీంతో పాటు కూటమి మేనిఫెస్టోతో వైసీపీ నేతలు డీలా పడుతున్నారు. ఎలాగైనా తమ అభ్యర్థిని గెలిపించుకోవాలనే ఉద్దేశంతో వలంటీర్లకు ఎరవేస్తున్నారు.

● బతిమిలాడడం.. లేదా భయపెట్టడం

వలంటీర్లు ఓటు వేయడానికి వైసీపీ నేతలు రూ.3 వేలు ఇస్తామని చెబుతున్నారు. దీంతో పాటు ఓటరుతో ఓటు వేయిస్తే ఆ ఓటరుకు రూ.3 వేలు ఇస్తామని తెలియజేస్తున్నారు. అందుకోసమే రాజీనామాలు చేసి ప్రచారంలోకి పాల్గొనాలని బతిమిలాడుతున్నారు. ఇప్పటికే అశోక్‌నగర్, పాతబస్తీ ప్రాంతంలో వలంటీర్లకు రూ.3 వేలు ముట్టజెప్పినట్లు సమాచారం. కొన్ని చోట్ల భయపెడుతున్నారు. నగరంలోని 51వ వార్డులో ఓ వార్డు వైసీపీ ఇన్‌చార్జి వలంటీర్లను భయభ్రాంతులకు గురిచేసినట్లు సమాచారం.

బ్యాలెట్ యూనిట్ల ఫస్ట్ లెవల్ చెక్ చేయండి

కర్నూలు(కలెక్టరేట్), మే 2: బ్యాలెట్ యూనిట్ల ఫస్ట్ లెవల్ వెరిఫికేషన్‌ను వేగవంతంగా పూర్తి చేసేలా చూడాలని బెల్ ఇంజనీర్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ ఈవీఎం గోడౌన్‌కు చేరుకున్న బ్యాలెట్ యూనిట్ల ఫస్ట్ లెవల్ వెరిఫికేషన్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు సంబంధించి కర్నూలు పార్లమెంటు స్థానానికి 16 మంది కంటే ఎక్కువ అభ్యర్థులు పోటీలో ఉన్నందున రెండో బ్యాలెట్ యూనిట్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కర్నూలు పార్లమెంటు స్థానాలకు అవసరమైన 1,989 బ్యాలెట్ యూనిట్లు జిల్లాకు వచ్చాయని తెలిపారు. జిల్లాకు వచ్చిన బ్యాలెట్ యూనిట్ల పనితీరును బెల్ సంస్థకు చెందిన 12 మంది ఇంజనీర్లు పరిశీలిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఈవీఎం నోడల్ అధికారి నాగరాజు నాయుడు, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ మురళి, డీఎల్పీవోలు, బెల్ ఇంజనీర్లు, వైసీపీ పార్టీ ప్రతినిధి కె.పుల్లారెడ్డి, బీజేపీ ప్రతినిధి సాయిప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



ఇం'డోర్' తెరుచుకోలేదు..'

- టీడీపీ హయాంలో చేపట్టారని నిధుల నిలిపివేత
- ఆగిపోయిన ఇండోర్ స్టేడియం పనులు
- ప్రభుత్వం తీరుపై క్రీడాకారుల అసహనం

ఆదోని (అగ్రికల్చర్) మే 2: ఎన్నికల ముందు ఆడుదాం-ఆంధ్ర అంటూ హడావుడి చేసిన వైసీపీ ప్రభుత్వం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు చేపట్టిన క్రీడా నిర్మాణ పనులపై వివక్ష చూపింది. ఐదేళ్లుగా ఒక్క పైసా కూడా మంజూరు చేయలేదు. దీంతో మొండి గోడలే వెక్కిరిస్తున్నాయి. ఆదోని పట్టణంలోని కొత్త బస్టాండ్ వెనుక విట్టా కిష్టప్ప నగర్‌లో టీడీపీ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం పేరుతో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపట్టింది. 2017-18లో నాటి సీఎం చంద్రబాబు నాయుడు రూ.2 కోట్లు ఇండోర్ స్టేడియం నిర్మాణానికి మంజూరు చేశారు. ఆ పనులను క్రీడా ప్రాధికారిక సంస్థ ద్వారా గృహ నిర్మాణ శాఖకు అప్పజెప్పారు. నంద్యాలకు చెందిన ఓ కాంట్రాక్టర్ ఆ పనులను టెండర్ ద్వారా దక్కించుకొని 2018లో ప్రారంభించారు. 60 శాతం పనులు పూర్తి పూర్తి చేశారు. ఎన్నికలు రావడంతో ప్రభుత్వం మారింది. సదరు కాంట్రాక్టర్‌కు గత టీడీపీ ప్రభుత్వం పనులు చేపట్టిందని బిల్లులను వైసీపీ ప్రభుత్వం నిలిపి వేసింది. ఒక్క రూపాయి కూడా ఐదేళ్లుగా విడుదల చేయకపోవడంతో సదరు కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదిలేశారు. వైసీపీ ప్రభుత్వం క్రీడాకారులకు పెద్ద పీట వేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నా క్షేత్రస్థాయిలో మాత్రం కనిపించడం లేదు. టీడీపీ ప్రభుత్వం నిర్మించిందన్న కక్షతో బిల్లులు చేయకపోవడంపై క్రీడాకారులు విమర్శలు గుప్పిస్తున్నారు.



ఆదోనిలో ఐదేళ్లుగా మొండి గోడలకే పరిమితమైన ఇండోర్ స్టేడియం



గోనెగండ్ల మండలం పుట్టపాశంలో మాట్లాడుతున్న ఎమ్మిగనూరు టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి



దేవనకొండ మండలం కుంకునూరులో మాట్లాడుతున్న ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్



ఓర్వకల్లు మండలం లొద్దిపల్లె సభలో మాట్లాడుతున్న పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత



తుగ్గలి మండలం నల్లగుండ్లలో మాట్లాడుతున్న పత్తికొండ అభ్యర్థి కేఈ శ్యాంబాబు



కోడుమూరు పట్టణంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో దస్తగిరి ప్రచారం



కోసిగి మండలం డి.బెళగల్ గ్రామంలో ప్రచార రథంపై నుంచి నమస్కరిస్తున్న మంత్రాలయం అభ్యర్థి



నగరంలో టీజీ భరత్‌కు తిలకం దిద్దుతున్న మహిళ



టీడీపీలో చేరిన వారితో బస్తిపాటి నాగరాజు, టీజీ భరత్

ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ పూర్తి


ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను వివరిస్తున్న ఆర్ఓ

కర్నూలు(న్యూసిటీ), మే 2: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా 137-కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ నగరంలోని ఔట్ డోర్ స్టేడియంలో నిర్వహించారు. గురువారం ఆర్వో ఎ.భార్గవతేజ పర్యవేక్షణలో కమిషనింగ్ కోసం నియమితులై శిక్షణ పొందిన 50 మంది అధికారులు వారి బృందాలు ప్రక్రియ నిర్వహించారు. బెల్(భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్) ఇంజనీర్లు కంట్రోల్ యూనిట్లలో అభ్యర్థుల వివరాలు లోడ్ చేయడం, వీవీప్యాట్లలో అభ్యర్థుల పేర్లతోపాటు వారి చిహ్నాలను లోడ్ చేశారు.

సూర్యప్రతాపం..

ఎండలకు అల్లాడిపోతున్న ఉపాధి కూలీలు

కర్నూలు(అగ్రికల్చర్), మే 2: గత పది రోజులుగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో సూర్యుడు విజృంభిస్తున్నాడు. గ్రామాల్లోని రైతులు, రైతు కూలీలు వ్యవసాయ పనులు పూర్తి కావడంతో జీవనోపాధి కోసం జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా కల్పించిన పనుల్లో పాల్గొంటున్నారు. ఎండల తీవ్రత రోజురోజుకు ఎక్కువ కావడంతో వీరు పనులు పూర్తి స్థాయిలో చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో కనీసం రూ.300 వేతనం కూడా అందుకోలేని పరిస్థితి. నంద్యాల జిల్లాలో 46.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కర్నూలు జిల్లాలో 45.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రెండు జిల్లాలో దాదాపు 20 మండలాల్లో తీవ్రమైన వడగాల్పులు వీస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. మరోవైపు గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు ఎటువంటి ప్రాణాపాయ పరిస్థితులు ఎదుర్కొకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ అమర్నాథ్ రెడ్డి తెలిపారు.

ఆ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 2: వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. గురువారం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.సోమన్న మాట్లాడుతూ 2024-25 విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే కళాశాలల యజమాన్యాలు ముందస్తు అడ్మిషన్ల పేరుతో విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. జూన్ 1 వరకు కళాశాలలకు ప్రభుత్వ సెలవులు ప్రకటించినప్పటికీ ఐఐటీ, నీట్, ఎంసెట్ కోర్సుల పేరుతో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కోశాధికారి అశోక్, నాయకులు మౌలాలి, శ్రీను సూరి, నరేంద్ర పాల్గొన్నారు.

21 మంది వలంటీర్లు రాజీనామా

సి.బెళగల్, మే 2: మండల కేంద్రమైన సి.బెళగల్ ఒకటి, రెండో సచివాలయాలలో 16 మంది, పోలకల్లు ఒకటో సచివాలయంలో ఐదుగురు మొత్తం 21 మంది వలంటరీలు గురువారం రాజీనామా పత్రాలు అందజేసినట్లు ఎంపీడీవో శకుంతల తెలిపారు. అలాగే వలంటీర్ల వద్ద నుంచి సెల్ ఫోన్లు, సిమ్ కార్డులను కూడా తీసుకున్నామన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన

సి.బెళగల్, మే 2: మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలోని బీసీ కాలనీలో టీడీపీ సీనియర్ నాయకుడు వెంకటప్ప ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు చంద్రబాబు ప్రవేశ పెట్టిన సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజనేయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రెడ్డి ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి


క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలు తెలుసుకుంటున్న పుల్లారెడ్డి

కర్నూలు(న్యూసిటీ), మే 2: నగర పాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లకు జీతాలు ఇవ్వని రెడ్డి ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఈ. పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం క్లాప్ ఆటో డ్రైవర్లతో సమావేశమై ఆయన మాట్లాడుతూ మేడే రోజు పారిశుధ్య కార్మికులను ప్రభుత్వ అధికారులు పస్తులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సభ్యులు ఎస్.రమణగౌడు, కే.శ్రీనివాసులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

నాటు సారా స్థావరాలపై సెబ్ దాడులు

కర్నూలు(అర్బన్), మే 2: నాటు సారా స్థావరాలపై దాడులు విస్తృతం చేసినట్లు సెబ్ సీఐ కేఆర్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. గురువారం స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ఓర్వకల్లు మండలం గుడుంబాయి తాండ, కొమరవోలు నాటు సారా స్థావరాలను గుర్తించి 2800 లీటర్ల నాటు సారా తయారీకి ఉపయోగించే బెల్లం ఊటను, 15 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేసి, శికారి కవిత అనే మహిళ నుంచి 32 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఓర్వకల్లు ఎస్ఐ రాజారెడ్డి, సెబ్ ఎస్ఐ రెహనా బుగం, మారుతీ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర။ 7382114647
AJA-176994

దుర్గాదేవి జ్యోతిష్యపీఠం
» దుర్గాదేవి జ్యోతిష్యపీఠం : S.V. రాఘవేంద్రజోషి, పునర్వివాహం, దాంపత్య సమస్యలు, అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు, విదేశీయానం, స్త్రీ ప్రేమ, వశీకరణం, ప్రతి సమస్యకు అంజనం, హోమాలతో 2 రోజుల్లో శాశ్వత పరిష్కారం. ✆ 6364 999 444
AJB-046

FOR ADVERTISEMENTS CONTACT. Cell: 99854 11369

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనం

టీజీ భరత్‌తో కలిసి ఎంపీ అభ్యర్థి నాగరాజు ప్రచారం


మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు


టీజీ భరత్‌కు హారతి ఇస్తున్న మహిళలు

కర్నూలు(అర్బన్), మే 2: జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు అన్నారు. గురువారం నగరంలోని వార్డుల్లో ఎమ్మెల్యే అభ్యర్థి టీజీ భరత్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి నాగరాజు మాట్లాడుతూ గత ఎన్నికల ముందు మడమతిప్పను.. మాట తప్పను అని జగన్ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కాడని ధ్వజమెత్తారు. చంద్రబాబు మాట ఇస్తే చేస్తారని, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావాలని అన్నారు. కర్నూలును అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ పట్టణంగా చేసే సత్తా భరత్‌కి ఉందని అన్నారు. ప్రజా సేవ చేసేందుకు చంద్రబాబు నాయుడు తనలాంటి యువతకు అవకాశం కల్పించారని, ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపిస్తే అధికారంలోకి వచ్చాక జిల్లాలోని ఎమ్మెల్యేలతో కలిసి పడకేసిన పాలనను పరుగులు పెట్టిస్తానని అన్నారు. నగరంలోని ఏ వార్డుకు వెళ్లినా ప్రజలు భారీ ఎత్తున తనకు స్వాగతం పలుకుతున్నారని, ప్రజల ఆదరణ చూస్తే గెలుపు ఖాయమనే ధీమా కలుగుతోందని అన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్‌తో పాటు ఎమ్మెల్యే అభ్యర్థి టీజీ భరత్ రూపొందించిన 6 గ్యారంటీలతో నగరం రూపురేఖలు మారుస్తామని హామీ ఇచ్చారు. అంతకముందు 46వ వార్డులో అబ్దుల్ రజాక్ ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. విద్యానగర్‌కు చెందిన పలువురు టీడీపీలో చేరారు.

అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు

టీడీపీ అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తామని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. గురువారం నగరంలోని 4వ వార్డులో టీజీ భరత్ భరోసా యాత్రలో ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తీసుకురావాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఒరిజనల్ డాక్యుమెంట్లు యజమానులైన ప్రజల వద్ద ఉండకపోతే ఎలా అన్నారు. ఈ డాక్యుమెంట్లపై ప్రభుత్వం అప్పు తీసుకుని ఆ భారం ప్రజలపై వేస్తారన్న భయంతో ప్రజల్లో ఉందని తెలిపారు. ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్న ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని చెప్పారు. ఐదేళ్లలో ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం తప్ప వైసీపీ పాలనలో ఒరిగిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, నాయకులు చెన్నా, ఊట్ల రమేష్, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ప్రజా సేవ కోసమే రాజకీయాల్లో ఉన్నా..

ప్రజా సేవ కోసమే తాను రాజకీయాల్లో ఉన్నట్లు కర్నూలు నియోజవర్గం టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. గురువారం నగరంలోని మౌర్యఇన్‌లోని ఆయన కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రజాక్ ఆధ్వర్యంలో 46వ వార్డుకు చెందిన వైసీపీ నాయకులు రామరాజు, సులేమాన్, నాగరాజు, అంజిలు, విద్యానగర్‌కు చెందిన పలువురు టీడీపీలో చేరారు. టీజీ భరత్ వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీలో చేరిన వారందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. కుల, మతం పక్కన పెట్టి కర్నూలు ప్రజలకు సేవ చేస్తామంటే నమ్మొద్దని కోరారు. 40 సంవత్సరాలుగా కర్నూలులో సేవా కార్యక్రమాలు చేస్తున్నానని, తన తండ్రిలాగే తాను కూడా కర్నూలు ప్రజలకు మంచి చేస్తానన్నారు. సమస్యలు లేని సమాజాన్ని నిర్మించేందుకు 6 గ్యారంటీలు అమలు చేస్తానని అన్నారు. ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ కర్నూలు నగరం సమస్యతో కొట్టుమిట్టాడుతున్నదన్నారు. టీజీ భరత్‌ను గెలిపిస్తే ప్రజలకు ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ఉజ్వల భవిష్యత్తు

టీడీపీ పాణ్యం అభ్యర్థి గౌరు చరిత


ఓర్వకల్లు మండలం బైరాపురంలో మాట్లాడుతున్న గౌరు చరిత


గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు


36వ వార్డు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గౌరు జనార్దన్‌రెడ్డి

ఓర్వకల్లు, మే 2: టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం అయితేనే.. పేద ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టీడీపీ పాణ్యం అభ్యర్థి గౌరుచరిత అన్నారు. గురువారం మండలంలోని బైరాపురం, లొద్దిపల్లె గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అంతకుముందు బైరాపురం సమీపంలో వెలసిన ఆంజనేయస్వామికి గౌరు చరిత, టీడీపీ నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు. బైరాపురం గ్రామంలో రోడ్‌షో నిర్వహించి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్య, ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న రైతుల భూములు ఆన్‌లైన్‌లో తొలగించాలని, టీడీపీ అధికారంలోకి రాగానే ఆన్‌లైన్‌లో ఎక్కించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. లొద్దిపల్లె గ్రామంలో రోడ్ షో నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నంద్యాల పార్లమెంటు ఉపాధ్యక్షురాలు పార్వతమ్మ, నాయకులు మోహన్ రెడ్డి, విశ్వేశ్వర రెడ్డి, చదువుల సుధాకర్ రెడ్డి, పసులూరు ప్రభాకర్ రెడ్డి, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి నాగముణి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల ఆంధ్రప్రదేశ్‌ను నవ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలంటే టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కాల్వ గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మణరావు, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ మేనిఫెస్టోతో వైసీపీ వెన్నులో వణుకు

కల్లూరు: టీడీపీ, బీజేపీ, జనసేన ఎన్నికల మేనిఫెస్టో విడుదలతో వైసీపీ నాయకుల వెన్నులో వణుకు మొదలైందని పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. గురువారం కల్లూరు మండలం తడకనపల్లె, ఓబులాపురం తండా, వామసముద్రంలో గౌరు చరిత ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం 20 ఏళ్ల వెనక్కి పోయిందని అన్నారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు డి.రామాంజనేయులు, వాకిటి మాధవి, సర్పంచు సహరాబీ, జుబేదాబీ, ప్రభాకర్‌రెడ్డి, కోటి పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన 200 కుటుంబాలు

ఓర్వకల్లు టౌన్, కనమడకల, కేతవరం గ్రామాల నుంచి వైసీపీకి చెందిన 200 కుటుంబాలవారు టీడీపీ పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి సమక్షంలో తెలుగుదేశంలో చేరారు. అలాగే కేతవరం గ్రామానికి చెందిన 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కల్లూరు అర్బన్ 35వ వార్డుకు చెందిన 50 కుటుంబాలు గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి.

గౌరు చరితను గెలిపించండి: గౌరు జనార్దన్‌రెడ్డి

పాణ్యం నియోజకవర్గం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరితను గెలిపించాలని గౌరు జనార్దన్‌రెడ్డి కోరారు. గురువారం కల్లూరు అర్బన్ 36వ వార్డు వాసవీనగర్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు గంగాధర్‌గౌడ్, నాగరాజు, నవీన్ పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో తనిఖీ

కర్నూలు(హాస్పిటల్), మే 2: నగరంలోని మాధవీనగర్‌లో గురువారం కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో వై.ప్రవీణ్ కుమార్ తనిఖీ నిర్వహించారు. అమ్మ హాస్పిటల్, నిత్యా మల్టి స్పెషాలిటీ క్లినిక్, డయాగ్నోస్టిక్ సెంటర్స్, సహాయ్ డయోగ్నస్టిక్ సెంటర్లను పరిశీలించారు. మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని ప్రతి ప్రైవేటు హాస్పిటల్‌లో ఫైర్ ఎన్‌వోసీ తప్పనిసరిగా ఉండాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు. అగ్నిప్రమాదం జరిగినప్పుడు ప్రైవేటు హాస్పిటల్స్‌లో తాగునీటి వసతి, కరెంటుకు సంబంధించిన వైరింగ్ సక్రమంగా ఉండాలన్నారు. తనిఖీలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, డా.శశివర్ధన్ రెడ్డి, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

రేపు నృత్య ప్రదర్శనలు

కర్నూలు(కల్చరల్), మే 2: నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో శనివారం సాయంత్రం 6.30 గంటలకు, కళాక్షేత్రం ఆధ్వర్యంలో 'కూచిపూడి నవ వసం తం' పేరుతో నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఒక ప్రకటనలో తెలిపారు. భరత కళా గ్రామ, నాట్యవేద కూచిపూడి కళానిలయం సంయుక్త ఆధ్వర్యంలో కూచిపూడిలో శిక్షణ పొందిన అభ్యాసకులతో ఈ ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, సిద్ధేంద్ర యోగి కూచిపూడి కళాపీఠం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, గౌరవ అతిథిగా కేంద్ర సంగీత నాటక అకాడమీ బిస్మిల్లాఖాన్ యువ పురస్కార గ్రహీత డాక్టర్ ఆర్ వసంత్‌కిరణ్ హాజరవుతారని ఆయన తెలిపారు. కూచిపూడి నృత్య గురువులు నాట్యాచార్య కె.తేజేశ్వర్, నాట్యాచార్య పి. రోహిత్‌కుమార్‌ల నేతృత్వంలో ఈ కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఉంటాయని ఓబులయ్య వివరించారు.

'టీడీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధం'

గూడూరు, మే 2: రాష్ట్రంలో టీడీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ వైస్ ఛైర్మన్ కురుకుంద రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు, టీడీపీ యువ నాయకుడు సృజన్ అన్నారు. గురువారం గూడూరు నగర పంచాయతీ పరిధిలోని ఆయా కాలనీల్లో టీడీపీ శ్రేణులు ఇంటింటికి వెళ్ళి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. టీడీపీ నాయకులు నాగప్ప యాదవ్, మన్నన్ బాష, చాంద్‌బాషా, విజయ్ కుమార్, అక్కలదేవి గిడ్డయ్య పాల్గొన్నారు.

ఘనంగా తిమ్మగురుడి ప్రభోత్సవం

గూడూరు, మే 2: గూడూరు పట్టణంలో తిమ్మగురుడు స్వామి ప్రభోత్సవం గురువారం నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రభోత్సవాన్ని తిలకించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చ కులు, భక్తులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యావకాశాలు కల్పించడమే లక్ష్యం


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న జి. శ్రీనివాస్

కర్నూలు(కల్చరల్), మే 2: ఇంటర్, డిగ్రీలలో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులైన పేద విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు కల్పించడమే లక్ష్యంగా చంద్రశేఖర విశ్వ మహా విద్యాలయం కృషి చేస్తోందని ఉప కులపతి ఆచార్య జి. శ్రీనివాస్ అన్నారు. గురువారం నగరంలోని శంకరమందిరం సమావేశ హాలులో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయనతోపాటూ కంచిపీఠం అడ్మిషన్ కోఆర్డినేటర్ యామిజాల నరసింహమూర్తి, ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు వెంకట రామరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వ మహావిద్యాలయం వీసీ విద్యార్థుల సేవలో ముందుకు పోతోందని అన్నారు. 50 ఎకరాల విస్తీర్ణంలో నెలకొల్పిన అత్యాధునిక భవనాల్లో విద్యార్థులకు 40 రకాల ఉన్నత విద్యాకోర్సులను అందిస్తోందని చెప్పారు.

చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం


చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బ్రాహ్మణ సంఘాల నాయకులు

కర్నూలు(కల్చరల్), మే 2: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ యువనేత నారా లోకేశ్‌లు కలిసి రూపొందించిన కూటమి మేనిఫెస్టోలో పేద బ్రాహ్మణుల సంక్షేమానికి పెద్దపీట వేయడాన్ని హర్షిస్తూ పలువురు బ్రాహ్మణ సంఘాల నాయకులు చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. గురువారం నగరంలోని కేసీ కెనాల్ సమీపంలోని శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపును ఆకాంక్షిస్తూ సత్య దేవునికి పూజలు చేశారు. టీడీపీ రాష్ట్ర బ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యుడు సముద్రాల శ్రీధర్, టీవీ రవిచంద్రశర్మ, సండేల్ చంద్రశేఖర్, శ్రీరామ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపే లక్ష్యం

కర్నూలు(అర్బన్), మే 2: ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే శ్యాంబాబు గెలుపే లక్ష్యంగా పత్తికొండ నియోజవర్గంలో సాంస్కృతిక విభాగం విస్తృత ప్రచారం చేస్తుందని స్కాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు హనుమంతరావు చౌదరి తెలిపారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గంలో కళాజాత బృందాలతో కలిసి పాటలు, నృత్యాలతో ఓటర్లలో టీడీపీ పథకాలు, మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని తెలిపారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.లక్ష్మి పద్మా చౌదరి ఆధ్వర్యంలో సన్మానించారు.

తాగునీటి కోసం బిందెలతో ధర్నా



అమీలియో హాస్పిటల్ ఎదురుగా బిందెలతో నిరసన తెలుపుతున్న కాలనీవాసులు


కర్నూలు(న్యూసిటీ), మే 2: నగర పాలక సంస్థ పరిధిలోని బళ్లారి చౌరస్తా ప్రాంతంలో తాగునీటి ఇబ్బందులు ఎక్కువయ్యాయి. గత 20 రోజుల నుంచి తాగునీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం సాయంత్రం 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకు కోడుమూరు రహదారిలోని వై.జంక్షన్ అమీలియో హాస్పిటల్ దగ్గర కాలనీవాసులు ధర్నా నిర్వహించారు. ఈ క్రమంలో కనీసం పోలీసులు గానీ, అధికారులు గానీ, కార్పొరేటర్లు ఎవరూ కూడా వారి బాధ పట్టించుకోలేదు. గత 20 రోజులుగా తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజల బాగోగులు పట్టించుకోని ఈ నాయకులు ఎందుకని నిరసనలో పాల్గొన్న కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇలాంటి వ్యక్తులను ఎన్నుకుంటే రాబోయే కాలంలో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో నాగేంద్రనగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అంతా దోపిడే: దస్తగిరి


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి


కోడుమూరు (రూరల్), మే 2: జగన్ పాలనలో ఇసుక, మద్యం, గంజాయి పేరుతో అంతా దోచుకున్నారని కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ముందుగా ఎస్సీ కాలనీలో ఎంపీటీసీ చాముండేశ్వరి, రవి దంపతుల ఆధ్వర్యంలో స్థానిక ఏబీఎం చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసీపీ నాయకులు సమస్యలను పక్కకునెట్టి ఇసుక, ఎర్రమట్టి దోపిడీతో రూ. వేల కోట్లు దోచుకున్నా రని విమర్శించారు. కార్యక్రమంలో మల్లిఖార్జున గౌడ్, ఆకెపోగు రాంబాబు, రవీంద్ర గౌడ్, యల్లప్పనాయుడు, కౌలుట్ల, బలరాం, నగేష్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన స్టాంటన్‌పురం 39వ వార్డు వైసీపీ నాయకులు

కర్నూలు(రూరల్), మే 2: కోడుమూరు నియోజకవర్గ పరిధిలో ఉన్న కర్నూలు స్టాంటన్‌పురం 39వ వార్డుకు చెందిన వైసీపీ నాయకులు కర్నూలు పార్లమెంట్ టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, టీడీపీ సీనియర్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో గురువారం టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఏపీ అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

కర్నూలు రూరల్ మండలం సూదిరెడ్డిపల్లెకు చెందిన జనసేన పార్టీ ఎంపీటీసీ సభ్యుడు మల్లయ్య ఆధ్వర్యంలో పలువురు విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి సంపూర్ణ మద్దతు తెలిపారు. కోడుమూరు మండలం పులకుర్తి గ్రామానికి చెందిన బీసీ నాయకులు, గూడురు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన పలువురు విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి టీడీపీకి మద్దతు తెలిపారు.


బస్తిపాటి నాగరాజుకు హారతి ఇస్తున్న మహిళలు

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

పోలింగ్ కేంద్రాలను జనరల్ అబ్జర్వర్ మీర్ తారీఖ్ అలీ

వెల్దుర్తి/ మద్దికెర, మే 2 : ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చే ఓటరుకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదోని, ఆలూరు, పాణ్యం, పత్తికొండ నియోజకవర్గాల ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ఐఏఎస్ మీర్ తారీఖ్ అలీ అధికారులను ఆదేశించారు. గురువారం వెల్దుర్తి మండలంలో చెరుకులపాడు, మల్లెపల్లె, అల్లుగుండు, మద్దికెర, అగ్రహారం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. వెల్దుర్తి ఎంపీపీ స్కూల్‌లో 5 బూత్‌లు ఉండడంపై అసహనం వ్యక్తం చేస్తూ, పోలింగ్ స్టేషన్‌కు ఓటర్లు వచ్చేందుకు, వెళ్లేందుకు రెండు దారులుండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వైసీపీ ప్రచార రథం తగిలి బాలుడికి గాయాలు

ఎమ్మిగనూరు(రూరల్), మే 2: ఏనుగుబాల గ్రామంలో వైసీపీ ప్రచారరథం తగిలి మెహెక్ (9) అనే బాలుడికి గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామస్థుల వివరాల మేరకు ఎమ్మిగనూరు వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుక ఎన్నికల ప్రచార నిమిత్తం ఏనుగుబాల గ్రామానికి వెళ్లారు. ప్రచార రథం ఢీ కొని గ్రామానికి చెందిన సజీవరావు కుమారుడు మెహెక్ (9) గాయపడడంతో చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

వైసీపీ నాయకులు టీడీపీలో చేరిక



కేఈ కృష్ణమూర్తి సమక్షంలో టీడీపీలో చేరిన గోవర్ధనగిరి గ్రామస్థులు

క్రిష్ణగిరి, మే 2: వెల్దుర్తి మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు 30 కుటుంబాలు గురువారం టీడీపీలో చేరారు. కంబాలపాడు గ్రామంలో మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి సమక్షంలో వారాది వెంకటస్వామి, పెద్ద మాదన్న, చిన్న మాదాన్నతో పాటు మరికొంత మంది తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల నాయకులు సుబ్బరాయుడు, జ్ఞానేశ్వర్ గౌడ్, రామచంద్రుడు, బలరాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుండి 150 కుటుంబాలు టీడీపీలో చేరిక



మీనాక్షినాయుడు సమక్షంలో టీడీపీలో చేరిన ఆదోని వాసులు

ఆదోని, మే 2: పట్టణంలోని 3వ వార్డు, బసవన్న కట్ట, గోకర్ జెండా కాలనీలకు చెందిన వైసీపీ నాయకులు బినిగేరి తిమ్మప్ప, రవితో పాటు 150 కుటుంబాలు గురువారం టీడీపీలో చేరారు. వారిని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు సాదరంగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ దేవేంద్రప్ప, రామస్వామి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, మారుతి నాయుడు పాల్గొన్నారు.

తాగునీరు అందించండి మహాప్రభో

కోసిగి మే 2: గ్రామాల్లో తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల ప్రచారానికి వచ్చే ఏ నాయకుడైనా మా దప్పిక తీర్చుతాడా అని ఆశగా ఎదురు చూస్తున్నారు. మండల పరిధిలోని చిన్నభూంపల్లి, పెద్దభూంపల్లి గ్రామాల్లో తాగునీరు లేక తల్లడిల్లుతున్నారు. పెద్ద భూంపల్లి గ్రామంలో ఐదు రోజుల నుంచి తాగునీరు లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. "అధికారులు గ్రామాలవైపు కన్నెత్తి చూడడం లేదు.. ఓట్లేయించుకొని అధికారం చెలాయించిన నాయకులు పత్తాలేరు. మా కన్నీటి కష్టాలు ఎవరు తీర్చుతారు" అంటూ ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



పెద్ద భూంపల్లి గ్రామంలో తాగునీటి కోసం గ్రామస్థుల కష్టాలు



బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647
AJA-176994

దుర్గాదేవి జ్యోతిష్యపీఠం
» దుర్గాదేవి జ్యోతిష్యపీఠం : S.V. రాఘవేంద్రజోషి, పునర్వివాహం, దాంపత్య సమస్యలు, అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు, విదేశీయానం, స్త్రీ ప్రేమ, వశీకరణం, ప్రతి సమస్యకు అంజనం, హోమాలతో 2 రోజుల్లో శాశ్వత పరిష్కారం. ✆ 6364 999 444
AJB-046

FOR ADVERTISEMENTS CONTACT. Cell: 99854 11369

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

FORMAT C-1
Declaration about Criminal Cases
I Candidate Name : **Sri.Manke Venkateswarlu,** S/o. Manke Laxmi Narayana, H.No: 3-266, Sangala, Krishnagiri, chunchu Yerragudi, Kurnool, Andhra Pradesh - 518225.
Party : **All India Kisan Janatha Party**
Brief description of case : **Land Dispute**
Fir : Fir No: 225/2020, Krishnagiri Police Station, Kurnool District.
Case No: 477/2021, JFCM Court, Dhone.
Sections of Concerned Act : Cr.No. 225/2020 U/s. 324, 506 r/w 34 IPC

S.L No	Name of the court	Case No. & Dated	Status of Case	Sections of the concerned and brief description of offence(s)
1.	JFCM Court, Dhone.	Case No : 477/2021	Case on Court Trial	Land Dispute fir.No.225/2020 Krishnagiri Police Station, Kurnool Dist. Section of Concerned Act. : Cr.No.225/2020 U/s.324, 506 r/w 34 IPC

Sd/- **MANKE VENKATESWARLU,** MLA Contesting Candidate, 142 - Pattikonda Assembly Constituency

రైతుల కష్టాలు పట్టని వైసీపీకి ఓటుతో
సత్తా చూపాలి





కేఈ శ్యాంబాబుకు వీరతిలకం దిద్దుతున్న లింగానాయనిదొడ్డి మహిళలు, హారతులతో స్వాగతం పలుకుతున్న మారెళ్లవాసులు

- కేఈ శ్యాంబాబు
- తుగ్గలి మండలంలో 11 గ్రామాల్లో విస్తృత ప్రచారం
- అడుగుడుగునా జననీరాజనాలు
- ముకెళ్ల, మారెళ్ల గ్రామాల వైసీపీ నాయకుల చేరిక

తుగ్గలి, మే 2: రైతులను విస్మరించిన అరాచక వైసీపీ ప్రభుత్వానికి ఓటుతోనే రైతుల సత్తా చూపాలని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం బొందిమడుగుల, నల్లగుండ్ల, మారెళ్ల, లింగనాయునిదొడ్డి, పెండేకల్, ఎద్దులదొడ్డి, తుగ్గలి తదితర గ్రామాల్లో కేఈ శ్యాంబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో దాదాపు 11 గ్రామాలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబుకు అడుగుగడుగునా జననీరాజనాలు పలికారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి హారతులు ఇవ్వడంతో పాటు నుదుటిపై వీరతిలకం దిద్ది, బారీ గజమాల వేసి మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేఈ శ్యాంబాబు సూపర్ సిక్స్ మేనిఫెస్టో పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఒక్క చాన్స్ అంటూ గద్దెనెక్కిన సైకో జగన్ రాష్ట్రాన్ని బీహార్ మార్చారని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే ఫ్యాక్షన్ నేపథ్యంలో ఎంతో మందిని పొట్టన పెట్టుకున్న కుటుంబం అని, అలాంటి వారిని గద్దెనెక్కిస్తే నియోజకవర్గం సర్వనాశనం అవుతుందని స్పష్టం చేశారు. బీసీలను అనగదొక్కుతూ అగ్రవర్ణాలకు పెత్తనం కట్టబెట్టడమే వైసీపీ ధ్యేయమన్నారు. ఎన్నికల్లో వైసీపీకి ఓటుతోనే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకట్రాముడు, తిరుపాల్ నాయుడు, వెంకటపతి, ఎద్దులదొడ్డి ప్రభాకర్ రెడ్డి, తిమ్మయ్య చౌదరి, మనోహర్ చౌదరి, ప్రతాప్ యాదవ్, వెంకట్రాముడు, తలారి రాముడు, రవి, మసాల శ్రీను, సర్పంచ్ విజయుడు, చక్రాల వీరేష్, బర్మ వీరేష్, రామా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● వైసీపీ నుంచి టీడీపీలో చేరిక:
కేఈ శ్యాంబాబు సమక్షంలో ముకెళ్ల, మారెళ్ల గ్రామాల వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. అనంతరం ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అరాచకాలు నచ్చక టీడీపీలో చేరుతున్నామని పేర్కొన్నారు.

● మా గుడిసెలకు పట్టాలు ఇప్పించండి
ఎన్నో ఏళ్ల నుంచి ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నామని, పట్టాలు ఇప్పించాలని మహిళలు కేఈ శ్యాంబాబును కోరారు. పెండేకల్ ఆర్ఎస్‌లో శ్యాంబాబు కాన్వాయ్ నుంచి దిగి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, విద్యుత్ సక్రమంగా లేదని, గుడిసెలకు పట్టాలు ఇవ్వడం లేదని కేఈ దృష్టికి తెచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



గుడిసె వాసులతో మాట్లాడుతున్న కేఈ శ్యాంబాబు

గ్రామాల్లో అభివృద్ధి శూన్యం

- దేవనకొండ మండలంలో విస్తృత ప్రచారం
- కుంకనూరు, పొట్లపాడులో తరలివచ్చిన జనం
- పేద విద్యార్థిని చదువుకు వీరభద్రగౌడ్ భరోసా
- కుంకనూరు, కొత్త పేట వాసులు టీడీపీలో చేరిక









విద్యార్థినిని ఓదార్చుతున్న వీరభద్రగౌడ్, కొత్త పేటలో పార్టీలోకి ఆహ్వానిస్తున్న వీరభద్రగౌడ్, ప్రచారంలో భాగంగా టీడీపీ జెండాతో బాలుడి విన్యాసం, హాళగుంద వైసీపీ నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న వీరభద్రగౌడ్

దేవనకొండ ,మే 2: ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏ గ్రామంలో చూసినా అభివృద్ధి శన్యమని టీడీపీ ఆలూరు అభ్యర్థి వీరభద్రగౌడ్ అన్నారు. గురువారం మండలంలోని కుంకనూరు, పొట్లపాడు, కరిడికొండ, తెర్నేకల్, పాలకుర్తి గ్రామాల్లో టీడీపీ శ్రేణులు, జనసేన ఇన్‌చార్జి వెంకప్పతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో హంద్రీనీవా పనులు పూర్తిచేసి మండలంలో దాదాపు 20 వేల ఎకరాలరు సాగునీరిచ్చామని, పిల్లకాలువ పనులు పూర్తి చేస్తే మిగిలిన 25 వేల ఎకరాలకు కూడా పూర్తిస్థాయిలో నీరిచ్చే అవకాశం ఉన్నా వైసీపీ నాయకులు పట్టించుకో లేదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ఏడాదిలోపు పొట్లపాడు హంద్రీపై వంతెన కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని, సైకిల్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వెంకట్రాముడు ,కన్వీనర్ విజయ్, జనార్దన్ గౌడ్, రంగన్న, ఉచ్చీరప్ప, రామారావునాయుడు, మల్లికార్జునగౌడ్, భాస్కర్ తదితరుల పాల్గొన్నారు.

పేద విద్యార్థిని చదువుకు భరోసా
ప్రచారంలో భాగంగా కుంకనూరులో పర్యటిస్తున్న వీరభద్రగౌడ్‌ను గ్రామానికి చెందిన ఎర్రిస్వామి కుమార్తె జ్ఞానేశ్వరి కలిసి తన కష్టాన్ని విన్నవించింది. తండ్రికి గుండె ఆపరేషన్.. కుటుంబ పోషణ భారంగా మారిందని, తనకు బిటెక్ చదవాలని ఉందని ఆయన దృష్టికి తెచ్చింది. స్పందించిన వీరభద్రగౌడ్ ఉన్నత చదువు చదివించే బాధ్యత తనదని అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. పక్కనే ఉన్న జనసేన ఇన్‌చార్జి వెంకప్ప సైతం తాను కూడా సహకరిస్తానని హామీ ఇచ్చారు.

భారీగా టీడీపీలోకి చేరికలు
మండలంలోని కుంకనూరు, కొత్తపేట గ్రామాల్లో టీడీపీలోకి చేరికలు భారీగా పెరిగాయి. కుంకనూరు సర్పంచు ఈరమ్మ దాదాపు వంద కుటుంబాలు, కొత్తపేటలో దాదాపు 50 కుటుంబాలు చేరాయి. వీరికి ఆలూరు వీరభద్రగౌడ్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

హాళగుంద : హాళగుంద మండలంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. వైసీపీ మాజీ జడ్పీటీసీ కురువ గంగమ్మ, ఆమె భర్త కురువ అయ్యాలప్ప తో పాటు హెబ్బటం గ్రామానికి చెందిన 30 కుటుంబాలు వైసీపీని వీడి వీరభద్ర గౌడ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు.

ప్రజల ఓటు అడిగే హక్కు వైసీపీకి లేదు



1



2



3

1 డి.బెళగల్ గ్రామంలో రాఘవేంద్రరెడ్డితో కలిసి విక్టరీ సింబల్ చూపుతున్న మహిళలు

2 దొడ్డి గ్రామంలో రాఘవేంద్రరెడ్డిని, మురళిని గజమాలతో సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

3 టీడీపీలో చేరిన పల్లెపాడు వైసీపీ నాయకులు

- మంత్రాలయం టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి
- పల్లెపాడులో వైసీపీని వీడి టీడీపీలో చేరిన దళితులు
- టీడీపీ ప్రచారానికి అనూహ్య స్పందన
- కదిలిన మహిళల దండు

కోసిగి, మే 2: మూడు సార్లు ఎమ్మెల్యేగా ఉన్న బాలనాగిరెడ్డి.. కనీసం గ్రామాల్లో ప్రజలకు తాగునీరు కూడా ఇవ్వలేకపోయారని, ఇప్పుడు ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే హక్కు వారికి లేదని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి అన్నారు. ప్రజలు కూడా వైసీపీ పార్టీని తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని స్పష్టం చేశారు. గురువారం మండల పరిధిలోని డి.బెళగల్, దొడ్డి గ్రామం, చింతకుంట, పల్లెపాడు, మూగలదొడ్డి, చిర్తనకల్, అగసనూరు, సాతనూరు, తుమ్మిగనూరు గ్రామాల్లో టీడీపీ ఎన్నికల పరిశీలకుడు మురళితో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రచార రథం దగ్గరకు వచ్చి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. కనీసం డ్రైనేజీలు, సీసీ రోడ్లు, తాగు, సాగునీరు వంటి మౌలిక వసతుల కల్పన కల్పించలేదని, ప్రజల్లోనే మార్పు వచ్చి టీడీపీ వైపే మొగ్గు చూపుతున్నారన్నారు. టీడీపీ ప్రవేశ పెట్టిన సూపర్‌సిక్స్ మేనిఫెస్టోను వివరించారు. టీడీపీ అభ్యర్థులకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ముత్తురెడ్డి, రామిరెడ్డి, పల్లెపాడు సర్పంచ్ రాజేంద్రనాయుడు, జ్ఞానేష్, తోవి రామక్రిష్ణ, అయ్యన్న, తాయన్న, వెంకటేశ్; వడ్డె మంజునాథ్, వెంకటేశ్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.



డి.బెళగల్ గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

పల్లెపాడులో టీడీపీలో చేరిన దళితులు
మండల పరిధిలోని పల్లెపాడు గ్రామంలో వైసీపీ పార్టీకి భారీ షాక్ తగిలింది. కొన్నేళ్లుగా వైసీపీని నమ్ముకుని క్రియాశీలకంగా ఉన్న దళితులు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. టీడీపీ సీనియర్ నాయకులు పల్లెపాడు రామిరెడ్డి ఆధ్వర్యంలో మంత్రాలయం ఉమ్మడి టీడీపీ అభ్యర్థి ఎన్.రాఘవేంద్రరెడ్డి, పార్టీ పరిశీలకుడు దేవళ్ల మురళి వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో పల్లెపాడుకు చెందిన దళిత నాయకులు యాకోబు, లక్ష్మన్న, అబ్రహం, ఆదామ్, మరియమ్మ, ఎలియాజ్ ఉన్నారు.

ప్రచారంలో దూసుకుపోతున్న బీవీ

- ఊరువాడల్లో టీడీపీ విస్తృత ప్రచారం
- బీవీకి మద్దతుగా మైనార్టీ కాలనీ మహిళలు
- పెసలదిన్నె వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరిక





బీవీ సమక్షంలో టీడీపీలో చేరుతున్న కులుమాల గ్రామ వైసీపీ కార్యకర్తలు, పుట్టపాశం సభకు హాజరైన జనం



బీవీ జయనాగేశ్వరరెడ్డికి మద్దతు తెలుపుతున్న మహిళలు

ఎమ్మిగనూరు, మే2: ఎన్నికల తేదీ సమీపిస్తుండటంతో టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో విస్తృత ప్రచారంతో పాటు పట్టణంలో ఆయా వార్డుల్లో జనాన్ని కలుస్తూ ప్రచారంలో దూకుడు పెంచారు. దీంతో టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో జోష్ పెరిగింది. నియోజకవర్గంలో గ్రామ గ్రామాల్లో టీడీపీ ప్రచారం మారుమోగుతోంది. వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుక గ్రామాల్లో ప్రచార రథంపై ఊరేగుతూ ప్రచారం నిర్వహిస్తుండగా టీడీపీ అభ్యర్థి బీవీ మాత్రం గ్రామాల్లోను, పట్టణంలోను ఇంటింటికి తిరుగుతూ ఓటు అభ్యర్థిస్తున్నారు. అలాగే వీధుల్లో మహిళలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ ఆ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు.

మైనార్టీ కాలనీ మహిళల మద్దతు
పట్టణంలోని ముస్లీం మైనార్టీ కాలనీకి చెందిన పలువురు మహిళలు బీవీ స్వగృహానికి తరలివచ్చి బీవీ జయనాగేశ్వర రెడ్డిని కలిసి స్వచ్ఛందంగా మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి దివంగత బీవీ మోహన్ రెడ్డి ఉన్న సమయంలో మైనార్టీకాలనీ ఏర్పాటైందని, దాని అభివృద్ధికి మీరందించిన సహకారానికి అండగా నిలవాలని తరలివచ్చినట్లు పేర్కొన్నారు.

మాచాని సోంనాథ్ విస్తృత ప్రచారం : టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి గెలుపుకోసం టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మాచాని సోంనాథ్ పట్టణంలోని మూడోవార్డులో వార్డు ఇన్‌చార్జీ చేనేత మల్లి ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట టీడీపీ చేనేత విభాగం నాయకులు మిన్నప్ప, కామర్తి మహేష్ పాల్గొన్నారు.

టీడీపీ విస్తృత ప్రచారం : నియోజకవర్గంలోని మూడు మండలాలతోపాటు పట్టణంలోని పలు వార్డుల్లో టీడీపీ గ్రామనాయకులు, మండల నాయకులు, వార్డు కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, ఇన్‌చార్జీలు, తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్‌నాయకులు ఇంటింటికి బీవీ గెలుపుకోసం ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కె. తిమ్మాపురం గ్రామంలో కురువ సంఘం టీడీ పీ జిల్లా సాధికార కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. గోనెగండ్ల మండలం పుట్టపాశం, అయ్యకొండ, గంజహళ్లి, అగ్రహారం, బైలుప్పల గ్రామాల్లో బీవీ విస్తృత ప్రచారం నిర్వహించారు.

నందవరం నాయకులతో బీవీ సమాలోచనలు : ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆయా మండలాల నాయకులతో బీవీ జయనాగేశ్వరరెడ్డి సమావేశమైయ్యారు. నందవరం మండల నాయకులు ముగతి ఈరన్న గౌడ్, మాదవరావు దేశాయ్, రఘుమూర్తి స్వామి, పార్థసారధి రెడ్డి, రైస్‌మిల్ నారాయణరెడ్డి, భార్గవ్‌లతో పాటు ఆయా గ్రామాల నాయకులతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలో దిశానిర్దేశం చేశారు.

పెసన్నదిన్నే వైసీపీ నాయకుల చేరిక : ఎమ్మిగనూరు మండలం పెసలదిన్నే గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు 20కుటుంబాలు గురువారం మాజీ ఎమ్మెల్యే బీవీ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో సైకో ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేయాలని కోరారు.